

కడపలోని కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసు భద్రత

ఒంటిమిట్టలో

వైసీపీకి కంచుకోటగా భావిస్తున్న ఒంటిమిట్టలో ఆ కోటకు బీటలు వచ్చాయి. జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీకి ఊహించని మెజార్టీ ఇచ్చారు. నువ్వా నేనా అన్న రీతిలో జరిగిన ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఎవరూ ఊహించని విధంగా రికార్డు స్థాయిలో 6267 ఓట్ల మెజారిటీ సాధించి వైసీపీ కంచుకోటను బద్దలు కొట్టడంలో టీడీపీ సరికొత్త రికార్డు సాధించింది.

# వైసీపీ కోటకు బీటలు

**● 6267 మెజారిటీతో ఒంటిమిట్టలో సరికొత్త రికార్డు**

- వైసీపీ రిగ్గింగ్‌ను అడుగడుగునా అడ్డుకున్న టీడీపీ నేతలు
- కుదేలైన వైసీపీ నాయకులు
- టీడీపీలో నయాజోష్

రాజంపేట/ఒంటిమిట్ట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలోని పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికలు రాష్ట్ర వ్యాప్తంగా బాగా ఆసక్తిని రేపాయి. ఇటు మీడియాలోనూ, అటు సోషల్ మీడియాలో ఎన్నికలపై విస్తృతంగా ప్రచారం జరిగింది. ముఖ్యంగా పులివెందుల ఉపఎన్నికపై జనం బాగా ఫోకస్ పెట్టారు. అలా హైటల్టేజీగా ఈ ఎన్నికలు మారాయి. ఫలితాలు కూడా అదే స్థాయిలో వచ్చాయి. సొంతూరు పులివెందులలో డిపాజిట్ కోల్పోయి ఘోరంగా ఓడిపోవడం, ఒంటిమిట్టలోనూ పరాజయం పొందడంతో జగన్ పార్టీకి ఈ ఓటమి చావుదెబ్బ అని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గురువారం కడప నగర శివారులోని మౌలానా ఆజాద్ ఉర్దూ యూనివర్సిటీలో ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు మొదలైంది. జేసీ అదితిసింగ్, ఎస్పీ అశోక్‌కుమార్, డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జడ్పీ సీఈవో ఓబులమ్మ పర్యవేక్షణలో కౌంటింగ్ మొదలైంది. పులివెందుల జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డికి 6,716 ఓట్లు రాగా వైసీపీ అభ్యర్థి తుమ్మల హేమంత్‌రెడ్డికి 683 ఓట్లు వచ్చాయి. 6,033 ఓట్ల ఆధిక్యంతో టీడీపీ అభ్యర్థి విజయం సాధించారు.

రాజంపేట నియోజకవర్గంలో చిన్న మండల కేంద్రంగా ఉన్న ఒంటిమిట్టలో కేవలం 13 పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 24 వేల మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల్లో 20,467 ఓట్లు పోలయ్యాయి. ఓట్ల లెక్కింపులో 19,836 ఓట్లు చెల్లాయి. 602 ఓట్లు చెల్లకుండా పోయాయి. 290 ఓట్లు నోటా కింద పడ్డాయి. టీడీపీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డికి రికార్డు స్థాయిలో 12,780 ఓట్లు వచ్చాయి. వైసీపీ అభ్యర్థి ఇరగం రెడ్డి సుబ్బారెడ్డికి 6513 ఓట్లు వచ్చాయి. టీడీపీ అభ్యర్థికి 6267 ఓట్ల మెజారిటీ వచ్చింది. అంటే వైసీపీకి దక్కింది టీడీపీ మెజారిటీ ఓట్లే దీనివల్ల ఒంటిమిట్ట మండలంలో వైసీపీ కుదేలైపోయిందని చెప్పవచ్చు. అనాదిగా ఈ మండలంలో వైసీపీ చాలా బలంగా ఉంది. ఈ మండలంలో అనేక గ్రామాలు ఒకే సామాజికవర్గం కింద ఉన్నాయి. వారి ఆధిపత్యంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఓట్లు వారు చెప్పినట్లే వేసేవారు. లేకుంటే రిగ్గింగ్‌లకు పాల్పడేవారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో ఇక్కడ వైసీపీకి 3150 మెజార్టీ వచ్చింది. ఇక్కడ మూడుసార్లు జడ్పీటీసీగా వైసీపీ అభ్యర్థులే ఉన్నారు. ఈ సమయంలో ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నిక వైసీపీ ఆధిపత్యానికి పెద్దగండి కొట్టింది. ఈ ఎన్నికను తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు టీడీపీ మండల నాయకుల సహకారంతో వైసీపీని దీటుగా ఎదుర్కొన్నారు. సాలాబాదు, నడింపల్లి, ఒంటిమిట్ట తదితర వైసీపీ ఆధిపత్యం ఉన్న గ్రామాల్లో రిగ్గింగ్‌ను వారు అడ్డుకున్నారు. భారీ పోలీసు బలగాలను మోహరించి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో టీడీపీ బలగాలు వైసీపీ నేతల ఆగడాలను అడ్డుకున్నాయి. కడప ఉమ్మడి జిల్లాకు సంబంధించిన ప్రధాన నాయకులు సుమారు 30 వాహనాల్లో మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద మోహరించి రౌడీలు, గూండాలతో ఎదిరించినా వారి ఆటలను సాగనివ్వలేదు. వారి ఆధిపత్యానికి గండికొట్టి చరిత్రలో నిలిచిపోయేలా ఒంటిమిట్టలో తెలుగుదేశం పార్టీ కొత్త రికార్డు సృష్టించింది. గత సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట నియోజకవర్గంలో స్వల్ప ఓట్లతో ఎమ్మెల్యే అభ్యర్థి ఓటమి చెంది నియోజకవర్గంలో టీడీపీ డీలాపడ్డ సమయంలో ఒంటిమిట్ట టీడీపీ అభ్యర్థి భారీ మెజారిటీ ఆ పార్టీ పూర్వ వైభవానికి బాగా కలిసి వస్తోంది. ఈ విజయంతో టీడీపీలో నయా జోష్ వచ్చింది.



ఒంటిమిట్టలో విజయోత్సవ కేక్ కట్ చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, జగన్‌మోహన్‌రాజు, జడ్పీటీసీ ముద్దు కృష్ణారెడ్డి



టీడీపీ విజయంతో ఒంటిమిట్టలో ర్యాలీ చేస్తున్న నేతలు

## అభివృద్ధికి ప్రజలు పట్టం కట్టారు

ప్రజలు బాగా ఆలోచించి అభివృద్ధికి పట్టం కట్టారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం మధ్యాహ్నం జడ్పీటీసీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డి విజయం తర్వాత రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజుతో కలిసి కోదండరామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీల మధ్య జరగలేదని, అరాచకానికి అభివృద్ధికి మధ్య జరిగాయన్నారు. ఈ విజయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రికి ఒంటిమిట్ట ప్రజలు కానుకగా ఇచ్చారన్నారు. రాముని ఆశీస్సులతో ఒంటిమిట్టను అభివృద్ధిపథంలో నడుపుతామన్నారు ఘనవిజయం అందించిన మండల ప్రజలకు మంచి చేసి హామీలను నెరవేస్తున్నామన్నారు. ఒంటిమిట్ట జగన్ కోట కాదు, ఇది కోదండరాముని అడ్డా అని అన్నారు. అనంతరం స్థానిక హరితా హోటల్‌లో కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, ఎన్నికల్లో విజయం సాధించిన జడ్పీటీసీ ముద్దు కృష్ణారెడ్డి, జనసేన పార్టీ నాయకుడు అతికారి కృష్ణ, టీడీపీ నాయకులు కొమరా వెంకటనరసయ్య, నల్గొండ వెంకటసుబ్బారెడ్డి, ఎద్దుల విజయసాగర్, బొడ్డే వెంకటరమణ లక్ష్మీనారాయణనాయుడులు ఈశ్వరయ్య, పామూరు సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

- మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

## ప్రజాస్వామ్యం గెలిచి నిలిచిన రోజు

**● రాష్ట్ర రోడ్డు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి**



ఇది ప్రజాస్వామ్యం. గెలిచి నిలిచిన రోజు. ఒంటిమిట్ట, పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించి ఇంతటి గొప్ప మార్పుకు శ్రీకారం చుట్టిన ఒంటిమిట్ట, పులివెందుల ప్రజలకు ప్రత్యేక అభినందనలు. గెలుపోటములకతీతంగా పులివెందులలో నియంతృత్వ ఏకగ్రీవాలకు చరమగీతం పాడినరోజే తెలుగుదేశం పార్టీ గెలిచింది. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి వయస్సు గురించి, పాప పుణ్యాల గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంది. పులివెందుల చరిత్రలో ఎన్నికలే జరగని పరిస్థితి నుంచి నేడు ఎన్నికలు జరగడం ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటింగ్‌లో పాల్గొని తమకు నచ్చిన ప్రతినిధి ఎన్నుకోవడం శుభ పరిణామం, అరాచక శక్తులకు ఎన్నికల ఫలితం నిజంగా చెంపపెట్టులాంటిది.

## వైసీపీకి బుద్ధి చెప్పారు



ఒంటిమిట్ట మండల ఓటర్లు జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో వైసీపీకి గట్టిగా బుద్ధి చెప్పారని ఒంటిమిట్ట జడ్పీటీసీ సభ్యుడు ముద్దు క్రిష్ణారెడ్డి తెలిపారు. వైసీపీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిపై 6267 ఓట్ల మెజార్టీతో ప్రజలు తనను గెలిపించి 30 ఏళ్ల చరిత్రను తిరగరాశారన్నారు. ఎన్నికల్లో వైసీపీ అరాచకాలు పనిచేయలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్షేమ పథకాలే తన గెలుపునకు సోపానాలుగా నిలిచాయన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతగా పనిచేస్తానని తెలిపారు.

- ముద్దు కృష్ణారెడ్డి, ఒంటిమిట్ట జడ్పీటీసీ



# నేడే స్త్రీ(ఫ్రీ) శక్తి

**● ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం**




కలికిరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు అమలు శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. జిల్లాలోని మదనపల్లె-1, మదనపల్లె-2, పీలేరు, రాయచోటి, రాజంపేట డిపోల్లో అవసరమైన సంఖ్యలో బస్సులను ఏర్పాటు చేశారు. అన్ని ఆర్టీసీ డిపోల్లోని ఐదు రకాల బస్సు సర్వీసుల్లో మాత్రమే ఉచిత ప్రయాణానికి అనుమతించనున్నారు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్‌లు, సిటీ ఆర్డినరీ, సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో మాత్రం ఈ సౌకర్యం కల్పిస్తున్నారు. ఇక అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, నాన్ ఏసీ స్లీపర్, స్టార్ లైనర్, ఏసీ బస్సులను ఉచిత ప్రయాణానికి మినహాయించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడి నుంచి ఎక్కడికైనా నిర్దేశిత బస్సుల్లో వెళ్లేందుకు వెసులుబాటున్నా తిరుపతి నుంచి తిరుమలకు మాత్రం ఉచిత ప్రయాణం లేనట్టే. ప్రతి డిపోలోనూ బస్సుల సంఖ్య పెరగనున్న దృష్ట్యా సిబ్బంది కొరత లేకుండా ఆన్ కాల్ విధానంలో డ్రైవర్లను నియమించారు. జిల్లాలోని మహిళలందరితో పాటు ట్రాన్స్‌జెండర్లకు కూడా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించనున్నారు. రోజూ 65 నుంచి 70 శాతం మహిళా ప్రయాణీకులు ప్రయాణించనున్నారని ఆర్టీసీ అంచనా వేస్తోంది. జిల్లాలోని ఐదు బస్సు డిపోలకు ఏడాదికి కనీసం రూ.70 కోట్ల మేర ఉచిత ప్రయాణ భారం పడుతుందని కూడా అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు ఉచిత ప్రయాణంతో ఒక్కో కుటుంబానికి రూ.800 నుంచి 3 వేల వరకు నెలకు ఆదా అవుతుందని కూడా అంచనాగా ఉంది.




## చిన్నారులకు డీపీటీ, టీడీ టీకాల ప్రత్యేక శిబిరాలు

**● డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీనరసయ్య**

రాయచోటిటౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల ఆరోగ్యం కోసం డీపీటీ, టీడీ వ్యాక్సిన్లు వేయడానికి ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో టీకాల ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీనరసయ్య, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉషశ్రీలు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5 నుంచి 7 సంవత్సరాల లోపు పిల్లలకు డీపీటీ వ్యాక్సిన్ (ధనుర్వాతం, కోరింత దగ్గు, కంఠసర్పి వ్యాధుల నివారణకు) 10 నుంచి 16 సంవత్సరాలలోపు పిల్లలకు టీడీ వ్యాక్సిన్ (ధనుర్వాతం, కంఠసర్పి)లను ఇస్తామన్నారు. ముఖ్యంగా ధనుర్వాతం, కోరింత దగ్గు, కంఠసర్పి, ఈ మూడు వ్యాధులు బ్యాక్టీరియాల ద్వారా వస్తాయని, ప్రమాదకరమైనవన్నారు. పిల్లల్లో అనారోగ్య పరిస్థితులను, మరణాలను తగ్గించడానికి పిల్లలకు ఈ వ్యాక్సిన్‌లను తప్పనిసరిగా ఇవ్వాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు 95 శాతం వ్యాక్సినేషన్ తప్పనిసరిగా చేయాలన్నారు. యాక్షన్ ప్లాన్ ప్రకారం పాఠశాలలకు వెళ్లి ఆరోగ్య సిబ్బంది వ్యాక్సిన్ ఇస్తారని తెలిపారు.

## నాడు అరాచకం

8

- నేడు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు
- నాడు ప్రత్యర్థులను నామినేషన్లు వెయ్యనివ్వని వైనం...
- నేడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న వైసీపీ నేతలు

# మహనీయుల త్యాగాలు మరువకూడదు

- స్వాతంత్ర్య ఫలాలు అందరివీ
- దేశాభివృద్ధిలో యువతే కీలకం
- నైతిక విలువలు కోల్పోతే సమాజమే సమాధి
- స్వాతంత్ర్య సమరయోధులు పెడబల్లె బాలయల్లారెడ్డి



స్వాతంత్ర్య సమరయోధుడు పెడబల్లె బాలయల్లారెడ్డి

చెన్నూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రాణాలను తృణప్రాయంగా పెట్టి మనకు స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుల త్యాగాలు మరిచిపోకూడదని, ఈ నాటి స్వేచ్ఛ వారి త్యాగాల ఫలితమే అని స్వాతంత్ర్య సమరయోధుడు పెడబల్లె బాలయల్లారెడ్డి అన్నారు. జిల్లాలో ప్రస్తుతం జీవించి ఉన్న ఏకైక స్వాంత్ర్య సమర యోధుడు ఈయనే. 105ఏళ్ల వయసులో కూడా స్వాతంత్ర్య దినోత్సవం వచ్చిందంటే ఆయనలో ఎక్కడ లేని ఆనందం, భావోద్వేగం కనిపిస్తాయి. ఆంధ్రజ్యోతి ఆయనను పలకరించగా.. నాటి స్మృతులు, పడ్డ కష్టాలు, యువకునిగా అప్పట్లో తాను బ్రిటీషు వారి ఆగడాలను ఎదుర్కోవడానికి తనతోటి స్వాతంత్ర్య సమరయోధులతో కలిసి చేసిన పనులు చెప్పుకొచ్చారు. నాటి అనుభవాలు, నేటి దేశ పరిస్థితి గురించి ఆయన మాటల్లోనే..

### కాజ్‌వే పగలకొట్టాం

బ్రిటీషు వారితో పెద్ద పోరాటాలు చేయకపోయినా మావంతుగా దేశం కోసం తెల్ల దొరలను కొంతమేర ఎదిరించి వారి పనులకు అడ్డుకట్ట వేయించాము. మండలంలో మొత్తం 18 మంది స్వాతంత్ర్య సమరయోధులు ఉండేవారు. 1943-44 ప్రాంతంలో చెన్నూరులో ఉన్న పెన్నా లోలెవల్ కాజ్‌వే మీదుగా బ్రిటీషు వారు రాకపోకలు సాగించకుండా రెండు చోట్ల కాజ్‌వేను పగలగొట్టాం. అప్పట్లో పెన్నాపై హైలెవెల్ వంతెన ఉండేది కాదు. కడప నుంచి నంద్యాల, కర్నూలు, హైదరాబాదు వెళ్లాలంటే ఈ చెన్నూరు వద్ద గల లోలెవల్ కాజ్‌వే దాటి వెళ్లాలి. అందుకే వారిని కడప వైపు రానివ్వకుండా కాజ్‌వేపైన రెండు చోట్ల పగలకొట్టి పెద్ద పెద్ద రాళ్లు తొలగించాం. దీంతో బ్రిటీషువారు కోపంతో మమ్మల్ని పట్టుకోవాలని జైల్లో పెట్టాలని ప్రయత్నించగా ఇతర సమరయోధులు, యువత కలిసి వారిని అడ్డుకున్నారు. అలా దేశం కోసం నావంతుగా చిన్నపాటి సాయమందించా.

### దేశభక్తి నూరిపోసేవారు

దేశాభివృద్ధిలో నాటి నుంచి నేటి వరకు యువతే కీలకం. నాడు పెద్దలు దేశభక్తి గీతాలు, చరిత్రలు, గొప్పగొప్ప వారి కథలు చెబుతుంటే విని యువ రక్తం పొంగి బ్రిటీషు వారిపై తిరగబడ్డారు. యువతలో ప్రేరణ కలిగించేందకు ఎందరో గొప్ప గొప్ప వారి చరిత్రలు ఊరువాడ వినిపించేవారు. పైగా మదనపల్లెలాంటి ప్రాంతాల నుంచి గొప్ప వ్యక్తులు వచ్చేవారు. దూర ప్రాంతాల నుంచి కూడా చెన్నూరుకు వచ్చి రాత్రివేళ దేశభక్తి గురించి యువతలో నూరి పోసేవారు. అందుకే యువత ఉత్తేజితమై బ్రిటీషు వారిని ఎదుర్కోగలిగాం.

### స్వాతంత్ర్య ఫలాలు అందరివీ

స్వాతంత్ర్యం కోసం కులమత జాతి భేదం లేకుండా పోరాడాం. ఈ పోరాటంలో ఎందరో పాల్గొన్నారు. వారి పోరాట ఫలితమే నేటి స్వాతంత్ర్య ఫలాలి. అందుకే అవి కొందరివి కాదు అందరివీ. అందరికీ సమానంగా అందాలి. అయితే నేడు కులం, జాతిలాంటివే సమాజాన్ని నడిపించే పరిస్థితి రావడం బాధ కలిగిస్తుంది. ఇది మంచి పద్ధతికాదు, దేశాభివృద్ధికి అడ్డంకి.

### దండలు - దండాలతోనే సరి

జిల్లాలో జీవించి ఉన్న సమరయోధుడు పెడబల్లె బాలయల్లారెడ్డి ఒక్కరే. ఆగస్టు 15 వచ్చినప్పుడల్లా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు రావడం శాలువాలు కప్పడం, మెడలో పూలదండలు వేయడం, నమస్కారాలతో సరిపెడుతున్నారు. ఒక్కగానొక్క సమరయోధుడు జీవించి ఉన్నాడు. ఆయన కుటుంబానికి కాస్తంత ఆసరా కల్పిస్తాం అన్న ఆలోచన మాత్రం నేటికీ ఎవరికీ లేదు. ఇంటిస్థలం ఇవ్వాలంటూ ఎన్నోమార్లు ఆయన విన్నవించగా 6 సెంట్ల స్థలం.. అదీ చలమారెడ్డిపల్లె గుట్టమీద ఇచ్చారు. 100 సంవత్సరాలు దాటిన వ్యక్తికి గుట్టమీద స్థలం ఇస్తే ఎలా..? గుట్టమీద కాకుండా ఊర్లో లేదా ఊరికి సమీపంలో స్థలం ఇవ్వాలని స్వాతంత్ర్య సమరయోధుడు కోరుతున్నారు.

### నైతిక విలువలు కోల్పోతే సమాధే

ప్రజలు నైతిక విలువలు కోల్పోతే సమాజమే సమాధి అవుతుంది. ఎవరిలో అయితే, ఎక్కడైతే నైతిక విలువలు ఏమాత్రం దిగజారకుండా ఉంటాయో అక్కడ అభివృద్ధి ఉంటుంది. నీతి నిజాయితీ నిండి ఉంటాయి. నేడు టీవీల్లో నేతల ప్రసంగాలు, అప్పుడప్పుడూ ప్రచారాలు చూస్తున్నా.. ఏమిటివి? దేశానికి ఉపయోగపడేవేనా అన్న విధంగా మనసుకు అనిపిస్తుంటుంది. వాస్తవ పరిస్థితుల్లో సమాజం మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. నాయకుల మాటలతో మభ్య పెట్టకుండా చేతలతో అభివృద్ధిని చూపిస్తూ దేశం కోసం పాటుపడాలి. అంతర్గత శత్రువులు నాటి నుంచి నేటి వరకు ఉంటున్నారు. వారిని నిర్దాక్షిణ్యంగా ఏరివేయాలి. అటువంటి వారు ఎవరైనా సరే ఉపేక్షించరాదు. యువత అన్నివిధాలుగా చైతన్యవంతులు కావాలి. దేశ సమగ్రతకు బాటలు వేయాలి. జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

# కూటమి పాలనలో రైతులే రాజులు

**● అన్నదాత సుఖీభవ పేరుతో ట్రాక్టర్ల ర్యాలీ**



ట్రాక్టర్‌ను ఉత్సాహంగా నడుపుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో రైతులే రాజులుగా వర్ధిల్లుతున్నారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. గురువారం టీడీపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మదనపల్లెలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ పేరిట 200 ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రైతుల సంక్షేమం కోరుతూ పనిచేస్తున్నారన్నారు. మొదటి విడతలోనే అన్నదాత సుఖీభవ పథకం కింద మదనపల్లె నియోజకవర్గ రైతులకు రూ.11 కోట్లు మంజూరు చేశారన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయమే ఏడాదిన్నర కూటమి ప్రభుత్వం పాలనకు నిదర్శనమన్నారు. అనంతరం ఎమ్మెల్యే స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక జడ్పీ హైస్కూల్ నుంచి బయలుదేరిన ర్యాలీ బెంగళూరు బస్టాండు మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ మార్కెట్‌యార్డు వరకు సాగింది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలు స్వామి, విద్యాసాగర్, సుద్దిళ్ల సుధాకర్, షంషీర్, నాదెళ్ల శివన్న, సహదేవ, కత్తి లక్ష్మన్న, మధుబాబు, నందకుమార్, నాగార్జున గాంధీ, వొంటికొండ వెంకటేశ్, మధు, తదితరులు పాల్గొన్నారు.


# నాడు అరాచకం..

- నేడు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు
- నాడు ప్రత్యర్థులను నామినేషన్లు వెయ్యనివ్వని వైనం...
- నేడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న వైసీపీ నేతలు
- వైసీపీ ద్వంద్వనీతి.. విస్తుపోతున్న జనం

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ప్రతిపక్షాలను తొక్కేశారు.. తామేమి చేసినా ఎదురు చెప్పకూడదన్నట్లు వ్యవహరించారు. ప్రజాస్వామ్యం అనే పేరు కూడా వినడానికి ఒప్పుకోలేదు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ముఖ్యనాయకులు ఎందరినో జైళ్లకు పంపించారు. మున్సిపాలిటీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ వంటి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలను కనీసం నామినేషన్లను కూడా వేయనీయలేదు. దౌర్జన్యంగా నామినేషన్ల పత్రాలను చించేసి ప్రశ్నించిన వారిపై దాడులు చేశారు. పోలీసులను అడ్డు పెట్టుకుని.. నామినేషన్లు వేయాలని చూసిన వారి మీద అక్రమ కేసులు బనాయించారు. దాదాపు 98 శాతానికి పైగా స్థానాలను ఏకగ్రీవంగా గెలుచుకున్నారు.

ప్రస్తుతం పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీలకు జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలిచారు. దీంతో రాష్ట్రంలో జగన్‌తో పాటు వైసీపీ నాయకుల నోట పదేపదే వినిపిస్తున్న మాట ప్రజాస్వామ్యం. ఇంతగా జగనన్న ప్రజాస్వామ్యం గురించి తపించడానికి కారణం తాము అధికారం కోల్పోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం.. గతంలో జరిగిన ప్రజా వ్యతిరేక పనులపై కేసులు పెట్టడం.. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓట్లు వేసుకోవడం.. దీంతో ప్రస్తుతం రాష్ట్రంలో వైసీపీ నాయకులు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నారు. జగనన్న ఐదేళ్ల పాలనలో ప్రజాస్వామ్యం ఏ విధంగా పరిఢవిల్లిందో.. చెప్పడానికి కింద కొన్ని ఉదాహరణలు.

### నామినేషన్ వేయనివ్వకుండా దాడి


వైసీపీ నాయకుల దాడిలో గాయపడిన గాజుల ఖాదర్‌బాష (ఫైల్)

2021లో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో రాయచోటి మున్సిపాలిటీలో నామినేషన్ వేయడానికి వస్తున్న టీడీపీ నాయకుడు గాజుల ఖాదర్‌బాషపైన అప్పట్లో వైసీపీ నాయకులు దాడి చేసి నామినేషన్ పత్రాలు చింపేశారు. రక్తగాయాలైన ఖాదర్‌బాషా పైనే 307 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. నామినేషన్లు వేయడానికి వచ్చిన పలువురిని పోలీసుల సాయంతో అడ్డుకున్నారు. ఏదో విధంగా నామినేషన్ వేసిన వాళ్ల నామినేషన్ పత్రాలను మున్సిపల్ కార్యాలయంలోనే చింపేశారు. 34 వార్డులు ఏకగ్రీవంగా గెలుచుకున్నారు. రాజంపేట మున్సిపాలిటీలో కొన్ని స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మదనపల్లె మున్సిపాలిటీలో 35 వార్డులకు గానూ.. 15 వార్డులను ఏకగ్రీవం చేసుకున్నారు.

### జడ్పీటీసీ, ఎంపీటీసీ అన్నీ ఏకగ్రీవమే

అన్నమయ్య జిల్లాలోని 30 మండలాల్లో అన్ని జడ్పీటీసీ స్థానాలూ వైసీపీ ఏకగ్రీవంగా గెలుచుకుంది. గుర్రంకొండలో మాత్రం ఎన్నిక జరగ్గా వైసీపీ గెలిచింది. అదే విధంగా ఎంపీటీసీ స్థానాలను పరిశీలిస్తే.. మదనపల్లె నియోజకవర్గంలో 50 స్థానాలకు 49 వైసీపీ ఏకగ్రీవంగా గెలుచుకుంది. ఒక స్థానాన్ని టీడీపీ గెలుచుకుంది. తంబళ్లపల్లె నియోజకవర్గంలో 73 ఎంపీటీసీ స్థానాలకు గానూ 72 వైసీపీ ఏకగ్రీవం చేసుకుంది. ఒక స్థానంలో ఇండిపెండెంట్ గెలిచారు. పీలేరు నియోజకవర్గంలో 59 ఏకగ్రీవం అయ్యాయి. 23 స్థానాల్లో ఎన్నికలు జరిగాయి. రాయచోటి నియోజకవర్గంలో 61 స్థానాలు వైసీపీ ఏకగ్రీవం చేసుకుంది. రాయచోటి మండలంలో ఒకటి, గాలివీడులో 2, లక్కిరెడ్డిపల్లెలో మూడు స్థానాలను టీడీపీ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచింది. రాజంపేట నియోజకవర్గంలో 69 స్థానాలకు గానూ 61 వైసీపీ ఏకగ్రీవం చేసుకుంది. ఎన్నికలు జరిగిన చోట తెలుగుదేశం రెండు, బీజేపీ ఒక చోట గెలిచింది. ఒంటిమిట్ట స్థానంలో ఏకగ్రీవంగా గెలిచిన ఆకేపాటి అమర్‌నాథరెడ్డి జడ్పీ చైర్మన్‌గా పని చేశారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో 74 స్థానాలకు గానూ 49 ఏకగ్రీవం చేసుకున్నారు. దీనిని బట్టి చూస్తే వైసీపీ హయాంలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఏమాత్రం ఉండేదో అర్థం అవుతుందని, అయితే ఇవేవీ గుర్తు లేనట్లు.. జగన్ అండ్ కో నేడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని పలువురు పేర్కొంటున్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల తనిఖీ


తహసీల్దారుతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ భావన

పెనగలూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాజంపేట సబ్‌కలెక్టర్ భావన గురువారం మండల రెవెన్యూ కార్యాలయ, మండల పరిషత్ కార్యాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయాల్లో రికార్డు గదులను, సిబ్బంది హాలును, పరిసర ప్రాంతాలను కలియదిరిగారు. రెండు కార్యాలయాల్లో సిబ్బందిని పరిచయం చేసుకుంటూ ఎవరెవరు ఏయే పనులు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట తహసీల్దారు అమరేశ్వరి, ఎంపీడీవో విజయరావు అన్నారు.

## చట్టంపై అవగాహన ఉండాలి

**జిల్లా సూక్ష్మనీటి సాగు అధికారిణి లక్ష్మీప్రసన్న**

రాయచోటి టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం-2005పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా సూక్ష్మ నీటి సాగు అధికారి లక్ష్మీప్రసన్న తెలిపారు. గురువారం రాయచోటి పట్టణ పరిధిలోని ఏపీఎంఐపీ జిల్లా కార్యాలయంలో క్షేత్రస్థాయి సిబ్బంది, ఇంజనీర్లు, జిల్లా కో-ఆర్డినేటర్స్, కంప్యూటర్ ఆపరేటర్లకు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 సంవత్సరం మే నెలలో పార్లమెంట్‌లో ఆమోదం పొంది అమల్లోకి వచ్చిందన్నారు. ఈ సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రతి అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడం కోసం అధికార యంత్రాంగం అదుపులో ఉన్న సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు తీసుకొచ్చారన్నారు. అదేవిధంగా పౌరులకు ముఖ్యమైన ఆయుధం అని, ఈ చట్టాన్ని ఉపయోగించి ప్రజలు హక్కులను కాపాడుకోవచ్చని తెలిపారు.

## అసంపూర్తి ఇళ్లను త్వరగా పూర్తి చేయండి

**కొత్తపల్లె గృహ లబ్ధిదారులతో సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి ● తహసీల్దారు కార్యాలయాల తనిఖీ**


కలికిరిలో ఇళ్లను పరిశీలించి సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ కళ్యాణి

కలికిరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లె గృహ నిర్మాణ కాలనీలో ఇళ్లను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి ఆదేశించారు. మండలంలో పలు చోట్ల ఆమె పర్యటించారు. ఎమ్మార్వో కార్యాలయంలో ఉద్యోగుల పని తీరు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. కుల ధృవీకరణలాంటి ధ్రువ పత్రాలను వెంటనే జారీ చేయాలన్నారు. కలికి రి-3 సచివాలయాన్ని సందర్శించి ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. ఉద్యోగుల హాజరు, ఇతర రికార్డుల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. కలికిరి కొత్తపల్లె గృహ నిర్మాణ కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడారు. నాలుగేళ్లగా మొండి గోడల స్థాయిలోనే వున్న ఇళ్లను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీ ఆధ్వర్యంలోని చెత్త సంపద (డంపింగ్ యార్డు) కేంద్రం నిర్వహణను పరిశీలించారు. చెత్త ద్వారా వర్మీ కంపోస్టు తయారీకి చేపట్టిన చర్యలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీఓ రియాజుద్దీన్ అహ్మద్, తహసీల్దారు హరికుమార్, డీ టీ సయ్యద్ పంచాయతీ కార్యదర్శి జి.అశోక్, హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

### తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

రామసముద్రం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ కళ్యాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి రెవెన్యూ సమస్యలపై తహసీల్దార్ మహ్మద్ అజారుద్దీన్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రతి సోమవారం రెవెన్యూ సమస్యలపై అర్జీలన్నింటినీ త్వరగా పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ వసీం అహ్మద్, సీనియర్ అసిస్టెంట్ రెడ్డెప్ప, మండల సర్వేయర్ నరేంద్ర, వీఆర్వోలు రెహ్మాన్, జగదీష్, రఘురామ్, అనూష, మమత, భారతి, గౌరీ, అనూష, సునీత, రమణ సిబ్బంది పాల్గొన్నారు.

### రీసర్వే పక్కాగా నిర్వహించాలి

నిమ్మనపల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో జరగుతున్న రీ-సర్వే పక్కాగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆమె ప్రభుత్వం విడుదల చేసిన అన్నదాత సుఖీభవ నిధులు రైతులకు చేరాయా అని వాకబు చేశారు. సిబ్బంది సూచించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

అనంతరం పీజీఆర్ఎస్ కార్యక్రమం తప్పకుండా నిర్వర్తించి రైతుల సమస్యను తీర్చాలన్నారు. రెవెన్యూ సిబ్బంది రీ-సర్వేలో అలసత్వం వహిస్తుండడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రీసర్వేలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తపస్విని, సర్వేయర్ గోపి, సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటు బాధిత కుటుంబానికి రూ.4 లక్షలు విడుదల

కలికిరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గత ఏప్రిల్ నెలలో పిడుగుపాటుకు గురై మరణించిన కడప జిల్లాకు చెందిన ఒక బాధిత కుటుంబానికి ప్రతిపాదనలు అందిన కేవలం వారం రోజుల్లోనే రూ.4 లక్షల పరిహారాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె గ్రామ పంచాయతీలోని మీనాపురం గ్రామానికి చెందిన పెద్దమైసూరయ్య కుమారుడు చిట్టిబోయిన మునుస్వామి గత ఏప్రిల్ 30న పిడుగుపాటుకు గురయి మృతి చెందాడు. దీనికి సంబంధించి ఈ నెల 6న జిల్లా కలెక్టరు పరిహారం విడుదల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రతిపాదనలందిన వెంటనే పరిహారం విడుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అన్ని ఆనవాయితీలను పూర్తి చేసి మునుస్వామి కుటుంబానికి పరిహారం అందజేయడానికి గురువారం విపత్తు సహాయ నిధుల నుంచి రూ.4 లక్షలు మంజూరు చేసి విడుదల చేసింది. జిల్లా కలెక్టరు తగిన చర్యలు తీసుకుని వెంటనే బాధిత కుటుంబానికి పరిహారం నిధులు బ్యాంకు ఖాతా ద్వారా నేరుగా చెల్లించాల్సిందిగా ఆదేశిస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి గురువారం ఆదేశాలు జారీ చేశారు.

## 500 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ


జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న దృశ్యం

నందలూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ జాతీయ జెండాలను నిషేధించాలని ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలని సమాజ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు, అడ్వకేట్ వాండ్రాసి పెంచలయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి 500 అడుగుల భారీ జాతీయ జెండాతో జూనియర్ కళాశాల నుంచి అరవపల్లెలోని ఆర్‌అండ్‌బి బంగ్లా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ ప్లాస్టిక్ తయారు చేసిన జాతీయ జెండాలను వినియోగించరాదని జాతీయ జెండా ప్రాముఖ్యత కాపాడటం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. ప్రతిఒక్కరిలో చైతన్యం రావాలని జాతీయ భారీ జెండాతో ర్యాలీ నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, సమాజ సేవా సమితి విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శి ఎస్కే జావిద్‌బాషా, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ విద్యార్థులు పాల్గొన్నారు.

## నిత్యపూజకోన అభివృద్ధికి కృషి

**● ఇన్‌చార్జి ఈవో శ్రీధర్**


దారిలో ఉన్న బండరాళ్లను చూపుతున్న ఇన్‌చార్జ్ ఈవో

సిద్దవటం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): లంకమల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజేశ్వరకోనలోని అటవీ ప్రాంతంలో శివ భక్తులు కాలినడకన నడుచుకుంటూ వెళ్లే రహదారి అభివృద్ధికి కృషి చేస్తానని ఇన్‌చార్జి ఈవో శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన సిద్దవటంలో గురువారం ఇన్‌చార్జి ఈవో మాట్లాడుతూ నిత్యపూజకోనలోని పంచలింగాల గుడి వద్ద నుంచి అటవీ ప్రాంతంలో కాలినడకన భక్తులు దర్శనానికి వెళ్లే రహదారి దాదాపు 3 కి.మీ. మేర పెద్ద పెద్ద బండలు ఉన్నాయన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాల్లో శివదర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు వస్తారని, గత ఏడాది జరిగిన ఉత్సవాల్లో రహదారి సరిగా లేక భక్తులు ఇబ్బంది పడినట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. కాలినడకన వెళ్లే రహదారి ఏనుగులు గుంత సమీపాన పెద్ద పెద్ద గుండ్లు రహదారికి అడ్డంగా ఉన్నాయని ఫారెస్ట్ అధికారుల అనుమతులు తీసుకొని రహదారి అభివృద్ధికి సహకరిస్తానని ఇన్‌చార్జ్ ఈవో శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ సిబ్బంది చంద్ర పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి


దేవేంద్ర (ఫైల్)

రాజంపేటటౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల పరిధిలోని కొత్తబోయనపల్లెలో గురువారం తెల్లవారుజామున కారు ఢీకొని బీటెక్ విద్యార్థి దేవేంద్ర(19) మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. కొత్తబోయనపల్లెలో అన్నమాచార్య యూనివర్శిటీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న రాయచోటికి చెందిన దేవేంద్ర, తాడిపత్రికి చెందిన ఇశ్వాంత్, మరో విద్యార్థి కలిసి ఖర్చుల నిమిత్తం బుధవారం సాయంత్రం ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో క్యాటరింగ్ నిర్వహించేందుకు వెళ్లారు. పని పూర్తయిన తర్వాత విద్యార్థులు ఇద్దరు కలిసి బోయనపల్లెకు తిరిగి నడుచుకుంటూ వెళుతున్న సమయంలో రాజంపేట నుంచి నందలూరు వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో దేవేంద్ర అక్కడికక్కడే మృతిచెందగా ఇశ్వంత్‌కు గాయాలు కావడంతో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## ఏపీఎంపై దాడి కేసులో ఇరువురి అరెస్టు

గుర్రంకొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఏపీఎం రజనీకుమారిపై దాడి చేసిన కేసులో ఇద్దరు నిందితులను గురువారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు. 12వ తేదీ విధి నిర్వహణలో ఉన్న ఏపీఎం రజనీకుమారిపై గుర్రంకొండ సంఘమిత్ర-3 పరిధి మహిళలు దాడి చేసి గాయపరచడంతో పోలీసులు ఆరుగురిపై కేసు నమోదు చేశారు. కేసులో నిందితులైన శేఖర్, గంగిరెడ్డిని మార్కెట్ యార్డు వద్ద అరెస్టు చేసి వీరిని రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

## కారు ఢీ... ఇద్దరు యువకులకు గాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకులు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఏపీ- కర్ణాటక రాష్ట్ర సరిహద్దులోని రాయల్పాడు సమీపం గెజ్జనూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మదనపల్లె మండలం, చీకలబైలుకు చెందిన ఇద్దరు యువకులు గాయపడ్డారు. గురువారం కర్ణాటక రాష్ట్రంలో టైల్స్ పనికి వెళ్లి ఇంటికి బైక్‌పై తిరిగి వస్తున్న యువకులను మదనపల్లె నుంచి బెంగళూరు వైపు వెళుతున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యువకులు రాజన్న (30), శశికుమార్(26) గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు రాయల్‌పాడు పోలీసులు కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ఇద్దరు ఏజీపీల తొలగింపు

**ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**

కలికిరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రెండు కోర్టుల్లో ప్రభుత్వ సహాయ న్యాయవాదులు (ఏజీపీ)గా పనిచేస్తున్న ఇద్దరిని తొలగిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మదనపల్లె రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో ఏజీపీగా ఉన్న ఆర్.షాజహాన్, కడప జిల్లా మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పనిచేస్తున్న వి.జె.ఎన్.శర్మల సేవలను ఉపసంహరిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. మూడేళ్ల కాల వ్యవధితో 2022 సెప్టెంబరు 27వ తేదీ నియమించిన ఈ ఇద్దరు ఏజీపీలను పాలనాపరమైన సౌలభ్యం కోసం గడువులోగా తొలగిస్తున్న కారణంగా నిబంధనల ప్రకారం ఒక నెల ముందస్తు గౌరవ వేతనాన్ని చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. అంతేగాకుండా కేసులకు సంబంధించి ఎలాంటి ఆటంకం తలెత్తకుండా సమీప కోర్టుల్లోని ప్రభుత్వ న్యాయవాదులను ఇన్‌చార్జులుగా నియమించాలని కూడా ప్రభుత్వం సూచించింది. ఈ ముగ్గురి స్థానాల్లో కొత్త ఏజీపీల భర్తీ కోసం తగిన అభ్యర్థుల ప్యానల్ జాబితాను కూడా త్వరగా సమర్పించాలని కలెక్టర్లను ఆదేశిస్తూ ప్రభుత్వ న్యాయ, శాసన వ్యవహారాల శాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి ఆదేశాలు జారీ చేశారు.

# దళారులు మారరంతే...

- బొప్పాయి టన్ను రూ. 7 నుంచి 8 వేలు
- ధరలు తగ్గించి కొంటున్న దళారులు
- ధరలపై హెల్ప్‌లైన్‌కు రైతుల ఫిర్యాదులు
- ప్రతిరోజూ చెక్‌పోస్టుల వద్ద అధికారుల తనిఖీలు



రైల్వేకోడూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బొప్పాయి ధరలపై రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధ, గురువారాలలో 7 మంది రైతులు హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేశారని కార్యాలయం అధికారులు తెలిపారు. ఫిర్యాదు చేసిన రైతులు లారీ నెంబర్లు, దళారుల ఫోన్ నెంబర్లు, రైతుల ఫోన్ నెంబర్లతో పాటు భూమి సర్వే నెంబర్లతో ఫిర్యాదు చేశారు. బొప్పాయి కాయలను టన్ను రూ.7 వేలకు తీసుకున్నారని తెలిపారు. దీనిపై సబ్ కలెక్టర్ రైల్వేకోడూరు రెవెన్యూ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖలకు చెందిన అధికారులతో చర్చించారు. హెల్ప్‌లైన్‌లో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సబ్ కలెక్టర్‌కు నివేదిక అందిస్తున్నారు. కొందరు దళారులు టన్ను రూ.7 వేలు, మరికొందరు టన్ను రూ.8 వేలతో బొప్పాయి కాయలను కోస్తున్నారని హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేస్తున్నారని కార్యాలయం అధికారులు చెబుతున్నారు. చాలామంది రైతులు దళారుల దగ్గర ముందస్తుగా డబ్బులు తీసుకున్నారు. దీంతో భయపడి తక్కువ రేటుకైనా కాయలను అమ్ముకుంటే సొమ్ము అవుతుందని కోతలు చేయిస్తున్నారు. గట్టిగా వాదించే రైతుల తోటల్లో దళారీలు కోతలు కోయడం లేదని రైతులు వాపోతున్నారు. కోతలు పూర్తయిన తర్వాత దళారులు లెక్కలు చూస్తారు. చాలామంది దళారులు లెక్కలు వేసినప్పుడు టన్ను రూ.9 వేలతో కట్టిస్తామని చెబుతున్నారని, కొందరు రూ.7 వేలు, రూ.8 వేలతో చీటీలు రాయిస్తున్నారని రైతులు తెలిపారు. చాలా మంది రైతుల తోటల్లో కాయలు ఎక్కడ మాగిపోతాయన్న ఆలోచనతో ఎంత ధరకైనా సరే కోతలు చేయాలని దళారులకు చెబుతున్నారని తెలిసింది. దళారుల దగ్గర అప్పులు తెచ్చిన రైతులు మాత్రం నోరుమెదపడం లేదు. కలెక్టర్ చామకూరి శ్రీధర్ టన్ను బొప్పాయి కాయలను రూ. 9 వేలకు తక్కువ లేకుండా కోతలు కోయాలని చెప్పినా 75 శాతం ఫలితం ఉన్నా మరో 25 శాతం దళారులు వినకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు చెబుతున్నారు. బొప్పాయి రైతుల కోసం సబ్ కలెక్టర్ భావన హెల్ప్‌లైన్ ఏర్పాటు చేస్తే దళారులకు భయపడిన చాలామంది రైతులు ఫిర్యాదు చేయడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. దళారులు వచ్చే ఏడాదిలో ముందస్తుగా అప్పులు ఇవ్వరని, గింజలు ఏర్పాటు చేయరని రకరకాలుగా రైతులను ఇబ్బందిపెడతారన్న భయంతో దళారులతో రైతులు చేతులు కలపక తప్పడం లేదని వినిపిస్తోంది. గత ఏడాది రోజుకు 200 లారీల్లో ఇతర నగరాలకు బొప్పాయి కాయలను ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం 60 నుంచి 70 లారీల్లో కాయలను ఎగుమతి చేస్తున్నారు. కాగా వచ్చే ఏడాది బొప్పాయి వ్యాపారం తారుమారుగా ఉండవచ్చని చాలామంది రైతులు చెబుతున్నారు. రైతులను ఇబ్బంది పెట్టే వాతావరణం ఉండవచ్చునని అంటున్నారు. రెవెన్యూ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖల అధికారులు, సిబ్బంది ప్రతి రోజు బొప్పాయి లారీలను తనిఖీ చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఢిల్లీలో వర్షాలు కురుస్తున్నాయని అందువల్ల ధరలు తగ్గుముఖం పడుతున్నాయని దళారులు అంటున్నారు. ఢిల్లీ మార్కెట్ మూడు రోజుల పాటు బంద్ అవుతుందని పంపిన కాయలు కుళ్లిపోతాయని వారు అంటున్నారు. వ్యాపారం పుంజుకుంటే ధరలు పెరుగుతాయని అంటున్నారు. ఇక అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది వేచిచూడాల్సి ఉంది.



లారీకి లోడింగ్ చేసిన బొప్పాయి కాయలు చిట్వేలి-రాపూరు సరిహద్దు చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

### ధర తగ్గిందంటూ ప్రచారం చేస్తే కఠిన చర్యలు

**● సబ్ కలెక్టర్ భావన**

రాజంపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : బొప్పాయి కాయల ధరలు తగ్గాయంటూ తప్పుడు ప్రచారం చేసిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టర్ హెచ్ఎస్ భావన హెచ్చరించారు. గురువారం ఆమె మాట్లాడుతూ కిలో బొప్పాయిని రూ.9 నుంచి 10 రూపాయలకు కొనడానికి వ్యాపారులు సిద్ధంగా ఉన్నారన్నారు. అయితే కొందరు దళారులు 7 రూపాయలకు పడిపోతుందంటూ ప్రచారం చేయడం తగదన్నారు. ఈ విధంగా రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటర్‌కు తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా ధర తక్కువకు అడిగితే హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసిన వెంటనే వారికి న్యాయం చేస్తామని తెలిపారు.

# పాత రేషన్ కార్డులకు స్వస్తి

- ఇక జిల్లాలో 5,78,841 స్మార్ట్ కార్డులు
- ఈనెలాఖరులోగా పంపిణీకి కసరత్తు
- సెప్టెంబరు 1 నుండి సరుకుల పంపిణీ




కడప కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల శాఖలో సమూల మార్పులకు కూటమి సర్కారు శ్రీకారం చుట్టింది. పేదలకు సబ్సిడీ బియ్యం, సరుకులు పారదర్శకంగా, సులభతరంగా సకాలంలో అందించేందుకు చర్యలు చేపట్టింది. గత జగన్ పాలనలో అనాలోచిత చర్యలకు రేషన్‌కార్డు లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. ఇంటి వద్దకే బియ్యం పథకం పేరుతో ఏర్పాటు చేసిన ఎండీయూ వాహనాల ద్వారా సరుకుల పంపిణీ అట్టర్‌ప్లాప్ అయింది. అప్పట్లో జారీ చేసిన రేషన్ కార్డులపై వైసీపీ ప్రచార పిచ్చిలో ఒక పక్క జగన్‌బొమ్మ, మరో పక్క ఆయన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిల బొమ్మలతో ముద్రించారు. అంతేకాకుండా లబ్ధిదారుల ఫొటో, పేర్లు కనిపించడం కష్టంగా ఉండేది. ఇలాంటి విధానాలపై దృష్టి సారించిన ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు పేదలకు పారదర్శకంగా బియ్యం, సరుకులు అందించేందుకు వీలుగా డిజిటల్ స్మార్ట్ కార్డుల ఇచ్చేం దుకు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదేండ్ల మనోహర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో పాత రేషన్ కార్డులకు స్వస్థి పలుకు తూ ఆస్థానంలో జిల్లాలో 5,78,841 రేషన్‌కార్డు లబ్ధిదారులకు ఏటీ ఎం కార్డుల తరహాలో డిజిటల్ స్మార్ట్ కార్డుల పంపిణీకి కసరత్తు చేపట్టారు. ఈ నెలాఖరు 25 నుంచి 31లోగా జిల్లాలో పాత కార్డు దారులతో పాటు కొత్తగా అర్హత పొందిన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందించనున్నారు.

**డిజిటల్ స్మార్ట్ రేషన్‌కార్డు ఇలా...**

ఇక డిజిటల్ స్మార్ట్ రేషన్‌కార్డు ఏటీఎం క్రెడిట్ కార్డు సైజ్‌లో క్యూ ఆర్ కోడ్‌తో ముద్రించారు. లబ్ధిదారులు బియ్యం, సబ్సిడీ సరుకులు తీసుకునే సమయంలో గతంలో సర్వర్ రాక ఈ పోస్ యంత్రాలతో ఇబ్బందులు ఉండేవి. ఇపుడు బయోమెట్రిక్ లేకుండా నేరుగా స్మార్ట్ కార్డులోని నెంబరు నమోదు చేస్తే లబ్ధిదారుల పూర్తి వివరాలు రానున్నాయి. ఈవిధానంలో కార్డుదారులు వెంటనే సరుకులు పొందే వీలుంటుంది.

**జిల్లాలో కొత్తకార్డులు**

జిల్లాలో 5,78,841 మంది లబ్ధిదారుల కుటుంబాలకు ప్రభుత్వం డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనుంది. వైసీపీ ప్రభు త్వంలో కొత్త రేషన్ కార్డులకు వేలాదిగా దరఖాస్తులు వచ్చినప్పటికీ కొత్తగా కార్డుల జారీ విషయంలో మీనామేషాలు వేసింది. దాదాపు రెండేళ్లపాటు నానబెట్టి పేదలను పథకాలకు దూరం చేసిందనే విమ ర్శలు ఉన్నాయి. 2024 ఎన్నికల ప్రక్రియ మొదలవ్వడంతో మెలిక పెట్టింది. నాటి నుంచి కొత్త రేషన్ కార్డులు, స్ప్లిటింగ్ కార్డులకు దర ఖాస్తులు క్రోడీకరించిన మీదట అర్హులుగా లెక్కించిన వారందరికీ చంద్రబాబు సర్కారు స్మార్ట్ కార్డులు అందజేయనుంది. ఇపుడు కూటమి సర్కారులో వచ్చిన 7,653 దరఖాస్తులను పరిశీలించి అర్హ త మేరకు 4,488 మందికి కొత్తగా రేషన్ స్మార్ట్ కార్డులందనున్నాయి. అలాగే స్ప్లిటింగ్ (సవరణలు, చేర్పులు, మార్పులు) కింద జిల్లాలో 10,269 దరకాస్తులు వచ్చాయి. అందులో 7453 కార్డులను సవరించి డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల రూపంలో అందించనున్నారు. ఈనెలా ఖరు నాటికి స్మార్ట్ కార్డుల పంపిణీ పూర్తయితే సెప్టెంబరు 1 నుంచి లబ్ధిదారులకు స్మార్ట్‌కార్డుల ద్వారా బియ్యం, సరుకులు పంపిణీ జరగనుంది.



**స్మార్ట్ రేషన్ కార్డులపై నేతల బొమ్మలకు చెక్**

గతంలో జారీ చేసిన రేషన్ కార్డులపై రాజకీయ నేతల బొమ్మలతో రేషన్ కార్డులుండేవి. ఇపుడు ఆ విధానానికి కూటమి సర్కారు చెక్ పెట్టింది. స్మార్ట్ కార్డులపై రాజకీయ నేతల బొమ్మల స్థానంలో ప్రభుత్వ రాజముద్రతో పాటు లబ్ధిదారుల ఫొటో, కుటుంబ సభ్యుల వివరాలు స్పష్టంగా కనిపించేలా రేషన్‌కార్డులు ఇప్పటికే చెన్నై కేంద్రంగా ముద్రణ పక్రియ పూర్తయినట్లు సవిల్ సప్లయ్ అధికా రులు చెబుతున్నారు. జిల్లాకు ఈ నెల 25 నుంచి 31 లోగా జిల్లా, మండలాల వారీగా నేరుగా స్మార్ట్ కార్డులను ప్రభుత్వం చేర వేయనుందన్నారు. ఈకార్డులన్నింటినీ సచివాలయ సిబ్బంది, అధికా రులు నేరుగా లబ్ధిదారుల ఇంటికే చేర వేయనున్నట్లు సమాచారం.

# పేస్ కళాశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన

- రెండు వర్గాలుగా విడిపోయిన డైరెక్టర్లు
- రోడ్డున పడిన విద్యార్థులు
- ఆందోళనకు సీపీఎం, విద్యార్థి సంఘాల మద్దతు



పేస్ కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పేస్ అకాడమి కళాశాలలో 45 రోజులుగా తరగతులు నిర్వహించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం కళాశాల వద్ద ఆందోళన నిర్వహించారు. పట్టణంలోని విద్యార్థులకు ఇంటర్మీడియట్‌లో నాణ్యమైన విద్యను అందించడానికి గత సంవత్సరం ఏడుగురు డైరెక్టర్లు కలిసి సాయిరాజేశ్వరి కాలనీలో పేస్ అకాడమిని ఏర్పాటు చేశారు. ఇంటర్‌తోపాటు ఐఐటీ, నీట్, జేఈఈ శిక్షణ ఇస్తామని చెప్పడంతో ఫీజులు అధికంగా ఉన్నా తల్లిదండ్రులు తమ పిల్లలను కళాశాలలో చేర్చారు. అయితే పేస్ అకాడమీకి ఇంటర్మీడియట్ బోర్డు నుంచి అనుమతి లేకపోవడంతో పరీక్షల సమయంలో విద్యార్థులకు ఇబ్బంది అవుతుందన్న ఉద్దేశ్యంతో టాప్‌మైండ్ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. అయితే పేస్ అకాడమీ పేరుతోనే ఇంటర్మీడియట్ తరగతులను నిర్వహిస్తూ ఐఐటీ, నీట్, జేఈఈ శిక్షణ ఇస్తున్నారు. ఇటీవల కళాశాల డైరెక్టర్ల మధ్య బేదాభిప్రాయాలు రావడంతో డైరెక్టర్లు రెండు వర్గాలుగా చీలిపోయారు. కొందరు డైరెక్టర్లు పేస్ అకాడమిని, కొందరు అధ్యాపకులను కళాశాలలోని ఫర్నీచర్ మరో చోటికి తరలించారు. తల్లిదండ్రుల ఆందోళనతో కళాశాలలో ఉన్న లొసుగులుగా వెలుగుచూశాయి. టాప్‌మైండ్ కళాశాలకు ఇంటర్మీడియట్ బోర్డు అనుమతి ఉన్నా ఐఐటీ, నీట్, జేఈఈ శిక్షణ ఇవ్వకపోవడం ఇబ్బందిగా మారింది. మరోపక్క పేస్ అకాడమి డైరెక్టర్లు ఐఐటీ, నీట్, జేఈఈ శిక్షణ ఇస్తామని పిల్లలను తమ వద్దకు పంపాలని ఒత్తిడి చేస్తున్నారు. అయితే పేస్ అకాడమికి ఇంటర్మీడియట్ బోర్డు అనుమతి లేకపోవడంతో తల్లిదండ్రులు ఎటు తేల్చుకోలేని స్థితిలో ఉన్నారు. ఇంటర్‌తోపాటు ఇతర ప్రవేశ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ఎక్కువ ఫీజులు చెల్లించి పిల్లలను పేస్ అకాడమిలో చేర్పించామని... డైరెక్టర్లు తమకు అన్యాయం చేశారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విద్యాసంవత్సరం వరకు డైరెక్టర్లు అందరు కలిసి తమ పిల్లలకు న్యాయం చేయాలని కోరుతున్నారు. వీరి ఆందోళనకు సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, ఏఐఎస్ఎఫ్ నాయకులు పీటర్, పీడీఎస్‌యూ మాజీ నాయకుడు ఓబులేసులు సంఘీభావం తెలిపారు. అధికారులు కళాశాల నిర్వాహకులపై చర్యలు తీసుకొని విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. కళాశాల వద్దకు వచ్చిన టుటౌన్ ఎస్‌ఐ ధనుంజయుడు సెలవుల తర్వాత సమస్యను పరిష్కస్తామని హామీ ఇవ్వడంతో తల్లిదండ్రులు ఆందోళన విరమించారు.

## ఫిజియోథెరపీ పరికరాల వినియోగంపై శిక్షణ

జమ్మలమడుగు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో గురువారం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో గీత, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ రఫిక్‌బాషా పర్యవేక్షణలో ఫిజియోథెరపిపై నర్సింగ్ సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిక్షణ ప్రధాన ఉద్దేశ్యంవృద్ధుల సంరక్షణలో ట్రెస్ మేనేజ్‌మెంట్ పద్ధతులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్న ఫిజియోథెరపీ పరికరాల సమర్థవంతమైన వినియోగంపై నర్సులకు అవగాహన కల్పించామన్నారు. మానసిక వైద్యురాల డాక్టర్ కవిత మానసిక ఆరోగ్య సమస్యలపై ఒత్తిడిని తగ్గించుకునే పద్ధతులపై సూచనలు ఇచ్చారు. ఫిజయోథెరపిస్టులు డాక్టర్ సమీవుల్లా ఖాన్, తదితరులు ఫిజయోథెరపి పరికరాల వినియోగంపై శిక్షణ ఇచ్చారు.

### భూ వివాదం కేసులో

## నలుగురికి జైలుశిక్ష

పోరుమామిళ్ల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): భూవివాదం కారణంగా నమోదైన ఓ కేసులో నలుగురికి రెండేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి పద్మశ్రీ తీర్పు ఇచ్చినట్లు సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. వారి వివరాల మేరకు... పోరుమామిళ్ల మండలంలోని చిన్నకప్పలపల్లెలో రెండు కుటుంబాల మధ్య భూ వివాదం నెలకొంది. ఈ కారణంగా అంకాల బంగారు పోలయ్య, వారి తల్లిదండ్రులను చంపాలనే ఉద్దేశ్యంతో అదే గ్రామానికి చెందిన అంకాల పోలయ్య, అంకాల పెద్దగురప్పుడు, అంకాల గురప్పుడు, అంకాల రామరాజు అనే వారు దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనకు సంబంధించి 2018లో నిందితులపై కేసు నమోదైంది. గురువారం బద్వేలు కోర్టులో సివిల్ జడ్జి పద్మశ్రీ తుది విచారణ జరిపి నేరం రుజువు కావడంతో రెండేళ్ల జైలుశిక్ష, రూ.500 జరిమానా విధించారన్నారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలలు జైలుశిక్ష అనుభవించాలని తీర్పు చెప్పారని వారు తెలిపారు. ఈ కేసులో ప్రభుత్వ అడిషనల్ పీపీ శ్రీనివాసులుకు సరైన సాక్ష్యాలు సమర్పించి.. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ కొండారెడ్డి కోర్టు హెడ్‌కానిస్టేబులు శ్రీనివాసరెడ్డిని జిల్లా ఉన్నతాధికారులు అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



పాములేటి మృతదేహం

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరస న్నపల్లె గ్రామానికి చెందిన పాములేటి (44) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పాములేటి తన సొంత పని నిమిత్తం బైకుపై బజారుకు వెళ్లి తిరిగి వస్తుండగా.. మార్గమధ్యంలో ఎద్దుల బండి అడ్డురావడంతో సడెన్ బ్రేకు వేశాడు. దీంతో అదుపు తప్పి కింద పడడంతో హుటాహుటిన 108 వాహనంలో తరలించగా మార్గ మధ్యంలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడు పాములేటి ఇటీవల కువైట్‌కు వెళ్లి నెల క్రితం ఇక్కడకు వచ్చారని.. రెండు మూడు రోజుల్లో తిరిగి కువైట్ వెళ్లాల్సి ఉండగా ఈ సంఘటన జరిగిందని కుటుంబసభ్యులు బోరున విలపించారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## ఎర్రగుంట్ల పీహెచ్‌సీలో తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న జోనల్ మలేరియా అధికారి

ఎర్రగుంట్ల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల పీహెచ్‌సీని గురువారం మలేరియా జోనల్ అధికారి డాక్టర్ జమాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులను, ల్యాబ్ ఫార్మసీ గదులను పరిశీలించారు. మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున జ్వరాలు అధికంగా వస్తున్నాయని.. తగిన జాగ్రత్తలు తీసుకోవా లన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జోష్న, సూపర్‌వైజర్ ఓబులేసు సిబ్బంది పాల్గొన్నారు.

## తైక్వాండోలో బంగారు పతకాలు



తైక్వాండోలో పతకాలు సాధించిన క్రీడాకారులు

పోరుమామిళ్ల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో తైక్వాండో పోటీల్లో పోరుమామిళ్ల క్రీడాకారులు మంచి ప్రతిభను చాటి పతకాలు సాధించారు. తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 10వ జాతీయస్థాయి తైక్వాండో పోటీలు విజయవాడలో నిర్వహించారు. ఈ పోటీల్లో వారియర్స్ తైక్వాండో అకాడమీ క్రీడాకారులు షర్ మేన్, నాగదీపిక, హరిచరణ్, గురు జశ్వంత్, అయిల్ బంగారు పతకాలు, వైష్ణవి, షరీఫ్ రజత పతకాలు సాధించినట్లు అకాడమీ నిర్వాహకులు తెలిపారు.

## క్రీడా పాఠశాల ప్రవేశ ఫలితాలు విడుదల

కడప స్పోర్ట్స్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కడప వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో 4,5 తరగతుల ప్రవేశానికి సంబంధించి గురువారం ఫలితాలు విడుదల చేశారు. ఇటీవల నిర్వహించిన వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అర్హులుగా ప్రకటించారు. ఇందులో కడప జిల్లా నుంచి 16 మంది విద్యార్థినీ విద్యార్థులు ఎంపికయ్యారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఎంపి కైన విద్యార్థులు ఈనెల 21న గురువారం క్రీడాపాఠశాలకు హాజరై సంబంధిత డాక్యుమెంట్లు అందించాలని క్రీడాపాఠశాల ప్రత్యేక అధికారి జగన్నాధరెడ్డి తెలిపారు.

**ఎంపికైన 4,5 తరగతుల విద్యార్థులు వీరే..**

డి.అర్జున్, డి.మోక్షగణేశ్, దివాన్‌కైవు, ఎం.జస్విక్, బి.విష్ణువర్ధన్‌రెడ్డి, ఇర్ఫాన్, కౌశల్ చంద్, ఏవీ విష్ణువర్ధన్‌రెడ్డి, టి.కశ్యప్, జి.దినేష్‌కుమార్, ఏఎం వైభవి, టీఎస్ నివేదిత, పి.హరిణి, వై.మోక్షిత, బి.నారాయణి ప్రియ, కె.లేవికారెడ్డిలు ఎంపికయ్యారు. అలాగే అన్నమయ్య జిల్లా నుంచి ఎ.వైష్ణవి, ఎం.గంగా హర్షిణి ఎంపికైన వారిలో ఉన్నారు.

## వర్ణకుమార్‌రెడ్డికి డాక్టరేట్



పులివెందుల రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పి.జి.వర్ణకుమార్‌రెడ్డికి డాక్టరేట్ దక్కింది. చెన్నైలోని వేల్స్ యూనివర్సిటీలో ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ ఎం.మీనా ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ రేడియో టెస్ట్‌బెడ్ ఉపయోగించి ఆటోమేటిక్ మాడ్యులేషన్ క్లాసిఫికేషన్ కోసం మిషన్ లెర్నింగ్ మరియు డీప్ లెర్నింగ్ అల్గోరిథమ్‌ల అభివృద్ధి అనే అంశంపై ఆయన పరిశోధన పూర్తిచేశారు. ఈ పరిశోధనలో, ఆధునిక వైర్‌లెస్ కమ్యూనికేషన్ వ్యవస్థల్లో మాడ్యులేషన్ గుర్తింపుని వేగవంతం చేయడం, ఖచ్చితత్వం పెంచడం, సాఫ్ట్ వేర్ డిఫైన్డ్ రేడియో (ఎస్‌డీఆర్) ఆధారిత పరీక్ష వేదిక ద్వారా వాస్తవ పరిసరాలలో ఈ అల్గో రిథమ్‌ల పనితీరును పరీక్షించారు. ఇందుకు ఆయన డాక్టరేట్ అందుకున్నారు. ఈసందర్భంగా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఆయనను అభినందించారు.

# బ్యాండ్ బాజాలు మోగిస్తే నికాహ్ చేయం

## మత గురువుల తీర్మానం

రాయచోటిటౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఇస్లాం మతానికి విరుద్ధమైన బ్యాండు బాజాలు మోగించడం, ఆర్కెస్ట్రా పెట్టడం, బాణా సంచాలు కాల్చడం, ట్రాన్స్‌జెండర్స్ లాంటి వ్యక్తులతో డ్యాన్సులు నిర్వహిస్తే అలాంటి పెళ్లిలో నికాహ్ చేయమని రాయచోటి పట్టణ సర్కాజీలు తీర్మానించారు. బుధవారం రాత్రి పట్టణంలోని పాతరాయచోటి మసీదులో మత గురువు షర్ఫుద్దీన్ ఆధ్వర్యంలో సర్కాజీలు మౌలానీ సలీం, ముఫ్తీ హబీబుర్ రెహమాన్, మౌలానా షబ్బీర్, మౌలానా అబ్దుల్ వాహిద్, హఫీజ్ అమీనుల్లాలు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ఇస్లాం మతానికి పూర్తి విరుద్ధంగా ముస్లింలు పెళ్లిళ్లు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాండు బాజాలు, బాణాసంచాలు, ఆర్కెస్ట్రా, ట్రాన్స్‌జెండర్లతో డాన్సులు నిర్వహించడం వంటి కార్యక్రమాలతో డబ్బు వృధా కావడమే కాకుండా ఇస్లాం మతానికి విరుద్ధమని, ఇలాంటి సాంస్కృతి కొనసాగిస్తే పేద ముస్లింల పెళ్లిళ్లు జరగడం కష్టతరం అవుతుందన్నారు. చాలామంది పేద కుటుంబాల్లో పెళ్లిళ్లు జరగక పోవడం వంటి ఘటనలు జరుగుతున్నాయని వారు ఆవేదన చెందారు. దీనికి రాయచోటిలో ఇద్దరు అక్కచెల్లెళ్లు ఆత్మహత్య చేసుకోవడమే నిదర్శమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నేతలు బుల్లెట్ మహబూబ్‌బాషా, జిన్నాషరీఫ్, ఆడిటర్ మన్సూర్‌అలీఖాన్, సయ్యద్ రియాజుద్దీన్, చెన్నూరు మస్తాన్‌వలి పాల్గొన్నారు.

# టిప్పర్ ఢీ.. ఇద్దరు మహిళల మృతి

- శుభకార్యానికి వెళుతుండగా ప్రమాదం
- మృతులు అన్నదమ్ముల భార్యలు



ప్రమాదంలో మృతి చెందిన సుహాసిని, గాయత్రి (ఫైల్ ఫొటోలు)

ఎర్రగుంట్ల / ముద్దనూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): శుభకార్యానికి వెళుతూ అన్నదమ్ముల భార్యలు దుర్మరణం చెందిన సంఘటన గురువారం కల మల్ల వద్ద చోటుచేసుకుంది. కలమల్ల ఎస్‌ఐ సునీల్ కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు ముద్దనూరు మండలంలోని కొసినేపల్లికి చెందిన వెంకటేష్, వెంకటరమణలు తమ భార్యలతో కలిసి మోటార్‌సైకిళ్లలో పెళ్లికి వెళ్లేందుకు ఎర్రగుంట్లకు బయలు దేరారు. మార్గమధ్యలో కలమల్ల వంకపై నిర్మించిన బ్రిడ్జి వద్ద కు వెళ్లగానే ఫ్లయాష్‌తో వెళుతున్న టిప్పర్ ఢీకొంది. దీంతో వెంకటేష్ భార్య గుడ్లోళ్ల గాయత్రి (25), వెంకటరమణ భార్య గుడ్లోళ్ల సుహాసిని (35) టిప్పర్ కిందపడటంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందారు. గాయత్రి తల నుజ్జునుజ్జు అయ్యింది. వెంకటేష్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించినట్లు సమాచారం. టిప్పర్ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

**మృతుల బంధువుల ఆందోళన :** వెంకరమణ, వెంకటేష్‌లు ఆర్టీపీపీలో పనిచేస్తున్నారు. వారిద్దరి భార్యలు మృతి చెందడంతో బంధువులు అక్కడకు చేరుకొని బోరున విలపించారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని బంధువులు ఆందోళనకు దిగారు. దీంతో మూడు గంటలపాటు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. టీడీపీ, వైసీపీకి చెందిన నాయకులు, ఆర్టీపీపీ ఉద్యోగకార్మికులు పెద్దఎత్తున సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి అక్కడకు చేరుకుని టిప్పర్ యజమానితో మాట్లాడి పరిహారం ఇప్పించేందుకు ఒప్పించడంతో ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



మృతదేహం వద్ద గుమికూడిన బంధువులు, ఆర్టీపీపీ ఉద్యోగులు

**కొసినేపల్లిలో విషాదఛాయలు**

ముద్దనూరు మండలం కొసినేపల్లి గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలోని అన్నదమ్ముల భార్యలు సుహాసిని, గాయత్రిలు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకొన్నాయి. గాయిత్రికి ఏడాదిన్నర కవలలు పిల్లలు ఉన్నారు. సుహాసికి బీటెక్, ఇంటర్ చదివే కుమారులు ఉన్నట్లు బంధువులు తెలిపారు.

# రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలి

రాజంపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాజంపేట జిల్లా కేంద్రం చేయాలంటూ రాజంపేట జిల్లా సాధన సమితి సభ్యులు సమావేశం నిర్వహించారు. రాజంపేట ఆర్అండ్‌బి ఆవరణంలో జిల్లా సాధన సమితి కన్వీనర్, న్యాయవాది టి.లక్ష్మీనారాయణ, ప్రైవేటు పాఠశాలల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు, జిల్లా డిగ్రీ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షులు గీతాంజలి రమణ తదితరుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో చారిత్రక పర్యాటక ప్రాంతమైన అన్ని వనరులు కలిగిన పార్లమెంట్, రెవెన్యూ డివిజన్ కేంద్రమైన రాజంపేటను గత జగన్ ప్రభుత్వం దురుద్దేశ్యంతో జిల్లాకేంద్రం చేయలేదని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఏర్పాటు చేసిన నూతన జిల్లాల మంత్రుల సబ్‌కమిటీ త్వరలో సమావేశాలు జరుగుతున్నందున రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలంటూ తీర్మానించారు. రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ గతంలో అనేక ప్రజా సంఘాలు, అన్ని రాజకీయ పక్షాలు చేసిన ఆందోళనలు వినతులను జగన్ ప్రభుత్వం బూడిదలో పోసిన పన్నీరుగా మార్చిందన్నారు. ఈ సమయంలో ఒంటిమిట్టను ఆంధ్ర భద్రాద్రిగా చేసినట్లు విమానాశ్రయం, రైల్వే, ఇతర అన్ని అర్హత లున్న రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలన్నారు. బ్రిటీష్ హయాంలో కంటే ముందు 105 సంవత్సరాల కిందట రాజంపేట రెవెన్యూ డివిజన్ కేంద్రంగా చేసి సబ్‌కలెక్టర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారన్నారు. జిల్లా కేంద్రం ఏర్పాటు చేయడానికి అన్ని వనరులు అర్హతలు ఉన్నఈ ప్రాంతాన్ని జిల్లా కేంద్రం చేయాలంటూ తీర్మానించారు. ఈ తీర్మానాన్ని ప్రభుత్వానికి పంపుతున్నట్లు జిల్లా కలెక్టర్‌కు అందజేయను న్నట్లు త్వరలో మంత్రుల సబ్‌కమి మన్నారు నాయకులు పోకల ప్రబాకర్, మైనార్టీ గుల్జార్ బాషా, సీనియర్ పాత్రికేయులు ఎస్.కళాంజలి, మైనార్టీ నాయకులు అబూబకర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశమైన జిల్లా సాధన సమితి సభ్యులు

## మండల సర్వసభ్య సమావేశం నేటికి వాయిదా

సంబేపల్లె, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో రామచంద్ర తెలిపారు. ఎంపీపీ ఆవుల నాగశ్రీలక్ష్మి కొన్ని అనివార్య కారణాల వల్ల రాకపోవడంతో ఎంపీటీసీ సభ్యులు హాజరు కాలేదు. దీంతో సమావేశం నేటికి వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. మండల సర్వసభ్య సమవేశాన్ని శుక్రవారంకి వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశంలో వన్‌బై ఫోర్త్ సభ్యులు హాజరుకాకపోతే సమావేశాన్ని మరుసటి రోజుకు వాయిదా వేయడం జరుగుతుందని తెలిపారు. మరుసటి రోజు కూడా సభ్యులు హాజరు కాకపోతే అనంతరం మళ్లీ సమావేశం తేదీని ఖరారు చేసి నిర్ణయించడం జరుగుతుందని తెలియజేశారు. గురువారం సమావేశానికి మండల స్థాయి అధికారులు అందరూ హాజరయ్యారు.

## ఉచితంగా మందుల పంపిణీ


విద్యార్థులకు మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రామాపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో గురువారం అదే కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి డాక్టర్ మురళీమోహన్ ఎంబీబీఎస్ పాఠశాల/ కళాశాల విద్యార్థులకు వివిధ రకాల మందులను దాదాపుగా రూ.15 వేలు విలువ కలిగిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీమోహన్‌కు పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామక్రిష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైసీపీలో చేరిక

రైల్వేకోడూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కూటమి నాయకుడు బత్తిన ఆనంద్‌యాదవ్ గురువారం మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డిల సమక్షంలో వైసీపీ కండువా కప్పుకున్నారు. భవిష్యత్తులో పార్టీకి వైసీపీలోకి చాలా మంది నాయకులు, కార్యకర్తలు చేరుతారని తెలిపారు.

## నేడు మాంసం విక్రయించొద్దు : కమిషనర్


మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు

రాజంపేటటౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు సందర్భంగా మున్సిపాలిటీ పరిదిలో మాంసం దుకాణాలు మూసివేయాలని మాంసం విక్రయాలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న వేళ మాంసం విక్రయాలు నిర్వహించరాదన్న నిబంధన ఉందన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లలో మున్సిపల్ పరిధిలో జంతుబలులు జరిగిన వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని తెలిపారు. జంతు మాంస విక్రకయాలు జరుగుతున్నట్లు తెలిసినా తమకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

## దళితవాడకు దారి సౌకర్యం కల్పించాలి

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ సమీపంలో వైఎస్ఆర్ దళితకాలనీకి దారి సౌకర్యం కల్పించాలని సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మహేశ్, సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు అన్నారు. గురువారం వైఎస్ఆర్ కాలనీలోని దళితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ 006-07 సంవత్సరంలో నాటి ప్రభుత్వం దళితులకు సర్వే నెంబర్ 713లో రెండు ఎకరాల 80 సెంట్లల్లో 90 నివాస స్థలాలు కేటాయించారు. ఇందులో దాదాపు 35 మంది నివాసాలు ఏర్పరుచుకొని నివసిస్తున్నారు. కానీ ఎటువంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో దళితులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దళిత కాలనీ దారి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత వాడ ప్రజలు పాల్గొన్నారు.

**అన్నమయ్య జిల్లా - టెండర్ ప్రకటన**

క.సెం 1359/2025-A1 — తేది : 14.08.2025

అన్నమయ్య జిల్లాలోని గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్య పనుల నిమిత్తం డీజిల్ ఆటోలు, ఇ-ఆటోలు, మరియు ట్రైసైకిళ్ల ఖరీదు ఖరారు కొరకు అర్హులైన సంస్థలు / కాంట్రాక్టర్లు / సరఫరాదారుల నుండి సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి.

టెండర్ షెడ్యూళ్లు, స్పెసిఫికేషన్లు మరియు ఇతర పూర్తి వివరాల కొరకు జిల్లా గ్రామ పంచాయతీ కార్యాలయం, రాయచోటి, అన్నమయ్య జిల్లా వారిని కార్యాలయ పనివేళల్లో సంప్రదించగలరు.

టెండర్ పత్రాలను దాఖలు చేయు తేది & సమయం : 15.08.2025 నుండి 21.08.2025 సాయంత్రం 5.00 గంటల వరకు

(శ్రీ జాయింట్ కలెక్టర్ & చైర్మన్, జిల్లా కొనుగోలు కమిటి వారి నోటు ఉత్తర్వుల మేరకు)

చైర్మన్, జిల్లా కొనుగోలు కమిటీ & జాయింట్ కలెక్టర్ వారి తరపున, అన్నమయ్య జిల్లా.

## టీడీపీ అభ్యర్థి గెలుపుపై హర్షం

ఒంటిమిట్ట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట జడ్పీటీసీ అభ్యర్థిగా ముద్దు కృష్ణారెడ్డి 6267 ఓట్ల మెజార్టీతో విజయం సాధించడంతో మండలంలో సంబరాలు అంబరాన్నంటాయి. అభ్యర్థి స్వగ్రామం అయిన మంటపంపల్లె పంచాయతీలో ప్రజలు సంబరాలు జరుపుకున్నారు. గత కొన్నేళ్లుగా మండలం వైసీపీకి కంచుకోటగా ఉండేది. ప్రస్తుతం టీడీపీ ఆ కంచుకోటను బద్దలు కొట్టింది. టీడీపీకి ఇంత భారీ మెజారిటీ రావడంతో మండల టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

## ఘనంగా కృష్ణంరాజు వర్ధంతి

రాజంపేటటౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాకను ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చేసిన ఆ గ్రామ కీ.శే.బాలరాజు కృష్ణంరాజు వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, రాష్ట్ర బీజేపీ కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొండూరు శరత్‌కుమార్‌రాజు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దెపల్లె ప్రతాప్‌రాజు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.సురేష్ రాజు, జనసేన పార్లమెంట్ నాయకుడు శ్రీనివాస రాజు, గ్రామస్థులు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలరాజు కృష్ణంరాజు విగ్రహానికి భారీఎత్తున పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

## బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ

ఓబులవారిపల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ పిలుపు మేరకు మండల పరిధిలోని కొర్లకుంట ప్రాంతంలో గురువారం బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో విద్యార్థులతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ముక్కా రూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా నాయకులు పులపత్తూరు రామసుబ్బారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ గడ్డం చెంగల్‌రాజు, చెంగల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ పోరాటం చేసిన జాతీయ నాయకులను స్మరిస్తూ విద్యార్థులతో బీజేపీ నాయకులు ర్యాలీలో పెనగలూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయంలో గురువారం సాయంత్రం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో మండలంలోని 15 సాగునీటి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి సాగునీటి సంఘం ప్రతినిధులను ఉద్దేశించి చేసిన ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. స్థానికంగా తమ పరిధిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆయన సూచన చేశారు. ఈ సమావేశంలో తహసీల్దారు అమరేశ్వరి, ఎంపీడీవో విజయరావు పాల్గొన్నారు.

## కూటమి విజయం - వైసీపీకి పరాజయం

రైల్వేకోడూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కూటమి విజయం సాధించిందని వైసీపీ పరాజయంతో కోలుకోలేని స్థితికి చేరుకుందని టీడీపీ రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు, దళిత నాయకుడు, సిద్దవటం పరిశీలకుడు పుల్లెల రమేష్ బాబు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పులివెందులలో అందరినీ వైసీపీ భయభ్రాంతులకు గురిచేసినా ఓటర్లు మాత్రం భయపడకుండా కూటమికే మొగ్గు చూపారన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో ఘన విజయానికి కారణం ప్రజలే అని తెలిపారు.

## పేదలకు అన్నదానం

రైల్వేకోడూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా గురువారం పేదలకు అన్నదానం చేశారు. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు ధ్వజారెడ్డికి పూలమాలలు వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీహెచ్ రమేష్‌బాబు, కంభం శ్రీనివాసులు పాల్గొన్నారు.

## బాధితులకు త్వరగా న్యాయం చేయండి

### - జిల్లా అదనపు ఎస్పీకి వినతి

రాయచోటిటౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో చార్జ్ షీట్‌లను త్వరగా పూర్తి చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి బాధితులకు న్యాయం చేయాలని దళిత హక్కుల పోరాటల సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విషయంపై జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మట్లాడుతూ అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో చార్జిషీట్లు త్వరగా పూర్తి చేసి చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత కుల పోరాట సమితి నేతలు చుక్కా వీరభద్ర, వండాడి రెడ్డిసుధాకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ


సీఎం సహాయనిధి చెక్కును పంపిణీ చేస్తున్న సాయిలోకేశ్

రాజంపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం మిట్టమీదపల్లె గ్రామంలో మొలకల రెడ్డెమ్మకు సీఎం సహాయనిది చెక్కు రూ.85115ను బీజేపీ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిలోకేష్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు చేదోడుగా సీఎం సహాయనిధి కింద సీఎం చంద్రబాబు ఈ ఆర్థిక సహకారం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ నాయకులు లక్ష్మీనారాయణచౌదరి, బీజేపీ నాయకులు కృష్ణయాదవ్, లక్ష్మీనారాయణచౌదరి, మాజీ సర్పంచ్ తోట రామయ్య, పత్తిపాటి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్‌గాంధీని విమర్శించే స్థాయి లేదు

● కాంగ్రెస్ పార్టీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్ గోశాలదేవి

రైల్వేకోడూరు రూరల్, 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీని విమర్శించే స్థాయి వైఎస్ జగన్‌కు లేదని కాంగ్రెస్ పార్టీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్ గోశాలదేవి తెలిపారు. గురువారం రైల్వేకోడూరులో మీడియాతో ఆమె మాట్లాడుతూ జగన్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. రాహుల్‌గాంధీపై జగన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు శాంతయ్య, నాయకులు సిగమాల రమేష్, సలోమి, శివక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మహాసభల గోడపత్రాలు ఆవిష్కరణ

రాజంపేటటౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు గురువారం గోడపత్రాలను ఆవిష్కరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మహేష్ మాట్లాడుతూ ఈ నెల 23న ఒంగోలులో సీపీఐ 28వ మహాసభలు నిర్వహిస్తుందని ఈ సభలకు జాతీయ కార్యదర్శి రాజా, నారాయణ, రామక్రిష్ణ తదితర రాష్ట్ర నాయకులందరూ హాజరవుతారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈ మహాసభలను నిర్వహిస్తున్న సందర్భంగా ప్రతిఒక్కరూ హాజరై ఈ సభను విజయవంతం చేయాలని వారు కోరారు.

## డిపాజిట్ రాకపోవడం సిగ్గుచేటు

రాజంపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లు అప్రజాస్వామిక పాలన చేసి రాష్ట్ర ప్రజలను అష్టకష్టాలపాలు చేసిన వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టిన అభ్యర్థికి పులివెందుల ఎన్నికల్లో డిపాజిట్ రాకపోవడం జగన్‌కు చెంపపెట్టులాంటిదని టీడీపీ సీనియర్ నేత, పారిశ్రామికవేత్త డాక్టర్ జీఎన్ నాయుడు పేర్కొన్నారు. ఒంటిమిట్ట, పులివెందుల్లో టీడీపీ అభ్యర్థులు గెలుపొందడం ప్రజల్లో చంద్రబాబుపై ఉన్న నమ్మకాన్ని తెలియజేస్తుందన్నారు.

## గృహ నిర్మాణాలు పూర్తికాకపోతే రద్దు


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి

పెనగలూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంజూరు చేసిన పీఎం ఆవాస్ యోజన పక్కా గృహాలు పొందిన లబ్ధిదారులు నిర్మాణాలు పూర్తి చేసుకోకపోతే రద్దవుతాయని, దాని ఫలితంగా లబ్ధిదారులు ఇప్పటివరకు తీసుకున్న ప్రభుత్వ సొమ్ము వెనక్కు ఇచ్చేయాల్సి వస్తుందని మండల ప్రత్యేక అధికారి పవన్‌కుమార్‌రెడ్డి లబ్ధిదారులకు సూచించారు. గురువారం పెనగలూరు జగనన్న లేవుట్‌ను ఆయన తనిఖీ చేసి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇదిలా ఉండగా జగనన్న కాలనీలోకి వచ్చే రహదారి చాలా దుర్భరంగా ఉందని, కనీసం చిన్న చిన్న వాహనాలైన హౌసింగ్ మెటీరియల్ తీసుకొని వచ్చేందుకు అనువుగా రోడ్డుకు మరమ్మతులు చేయాలని లబ్ధిదారులు కోరారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ హరిప్రసాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుజ్ఞాని, గ్రామ కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## వెటర్నరి సిబ్బందిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

పెనగలూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకర్లవారిపల్లె వెటర్నరి ఆసుపత్రిలో సిబ్బంది తరచూ విధులకు డుమ్మా కొడుతున్నారని, వారిపై చర్యలు తీసుకుని వెటర్నరి ఆసుపత్రి సక్రమంగా నడిపే విధంగా చర్యలు చేపట్టాలని కాకర్లవారిపల్లెకు చెందిన కాకర్ల నాగేశ్వరనాయుడు, కేఎస్ఆర్ గురువారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. అప్పుడప్పుడు ప్రజలకు అవసరం కాని సమయంలో కొంతసేపు వాకిలి తీసి తరువాత వెళ్లిపోతున్నారని ఈ సందర్భంగా తెలిపారు. ఎప్పుడో ఒకప్పుడు వచ్చే పశుసిబ్బంది రాక కోసం అదేపనిగా కాచుకొని కూర్చున్న కొంత మంది నిరుపేద పశువుల యజమానులు తమ పవువులకు ఫలాన జబ్బు చేసిందని మందులు ఇవ్వాలని అడిగినప్పుడు ఒక చీటీ రాసి ఇచ్చి బయట కొనుక్కొని తీసుకుని వస్తే ఆ మందు ఆ పశువుకు వేస్తామని చెప్పడం బాధాకరమైన విషయమని ఆయన అన్నారు. పశువుల ఆసుపత్రులకు ప్రభుత్వం మందులు సరఫరా చేస్తుందా లేదా అని ఈ సందర్భంగా ప్రశ్నించారు. ఈ విషయంపై వెటర్నరి ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని ఆయన కోరారు. ఈ విషయంపై కాకర్లవారిపల్లె వెటర్నరి డాక్టర్‌ను వివరణ కోరేందుకు సంప్రదించగా అందుబాటులో లేరు.

## భారీ బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీ చేపట్టిన ఎంపీడీవో రామచంద్ర తదితరులు

సంబేపల్లె, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి భారతీయుడు భారతీయ సమగ్రత, జాతీయ ఐక్యత చాటుకునే ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని అందరిలో భారతదేశ స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని నింపడమే ఉద్దేశ్యమని ఎంపీడీవో రామచంద్ర తెలిపారు. గురువారం ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో హర్ ఘర్ అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సంబేపల్లె మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండు సర్కిల్ వరకు అధికారులతో కలిసి బైక్ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నాడు అరాచకం..

- నేడు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు
- నాడు ప్రత్యర్థులను నామినేషన్లు వెయ్యనివ్వని వైనం...
- నేడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న వైసీపీ నేతలు
- వైసీపీ ద్వంద్వనీతి.. విస్తుపోతున్న జనం

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ప్రతిపక్షాలను తొక్కేశారు.. తామేమి చేసినా ఎదురు చెప్పకూడదన్నట్లు వ్యవహరించారు. ప్రజాస్వామ్యం అనే పేరు కూడా వినడానికి ఒప్పుకోలేదు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ముఖ్యనాయకులు ఎందరినో జైళ్లకు పంపించారు. మున్సిపాలిటీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ వంటి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలను కనీసం నామినేషన్లను కూడా వేయనీయలేదు. దౌర్జన్యంగా నామినేషన్ల పత్రాలను చించేసి ప్రశ్నించిన వారిపై దాడులు చేశారు. పోలీసులను అడ్డు పెట్టుకుని.. నామినేషన్లు వేయాలని చూసిన వారి మీద అక్రమ కేసులు బనాయించారు. దాదాపు 98 శాతానికి పైగా స్థానాలను ఏకగ్రీవంగా గెలుచుకున్నారు.

ప్రస్తుతం పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీలకు జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలిచారు. దీంతో రాష్ట్రంలో జగన్‌తో పాటు వైసీపీ నాయకుల నోట పదేపదే వినిపిస్తున్న మాట ప్రజాస్వామ్యం. ఇంతగా జగనన్న ప్రజాస్వామ్యం గురించి తపించడానికి కారణం తాము అధికారం కోల్పోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం.. గతంలో జరిగిన ప్రజా వ్యతిరేక పనులపై కేసులు పెట్టడం.. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓట్లు వేసుకోవడం.. దీంతో ప్రస్తుతం రాష్ట్రంలో వైసీపీ నాయకులు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నారు. జగనన్న ఐదేళ్ల పాలనలో ప్రజాస్వామ్యం ఏ విధంగా పరిఢవిల్లిందో.. చెప్పడానికి కింద కొన్ని ఉదాహరణలు.

### నామినేషన్ వేయనివ్వకుండా దాడి


వైసీపీ నాయకుల దాడిలో గాయపడిన గాజుల ఖాదర్‌బాష (ఫైల్)

2021లో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో రాయచోటి మున్సిపాలిటీలో నామినేషన్ వేయడానికి వస్తున్న టీడీపీ నాయకుడు గాజుల ఖాదర్‌బాషపైన అప్పట్లో వైసీపీ నాయకులు దాడి చేసి నామినేషన్ పత్రాలు చింపేశారు. రక్తగాయాలైన ఖాదర్‌బాషా పైనే 307 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. నామినేషన్లు వేయడానికి వచ్చిన పలువురిని పోలీసుల సాయంతో అడ్డుకున్నారు. ఏదో విధంగా నామినేషన్ వేసిన వాళ్ల నామినేషన్ పత్రాలను మున్సిపల్ కార్యాలయంలోనే చింపేశారు. 34 వార్డులు ఏకగ్రీవంగా గెలుచుకున్నారు. రాజంపేట మున్సిపాలిటీలో కొన్ని స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మదనపల్లె మున్సిపాలిటీలో 35 వార్డులకు గానూ.. 15 వార్డులను ఏకగ్రీవం చేసుకున్నారు.

### జడ్పీటీసీ, ఎంపీటీసీ అన్నీ ఏకగ్రీవమే

అన్నమయ్య జిల్లాలోని 30 మండలాల్లో అన్ని జడ్పీటీసీ స్థానాలూ వైసీపీ ఏకగ్రీవంగా గెలుచుకుంది. గుర్రంకొండలో మాత్రం ఎన్నిక జరగ్గా వైసీపీ గెలిచింది. అదే విధంగా ఎంపీటీసీ స్థానాలను పరిశీలిస్తే.. మదనపల్లె నియోజకవర్గంలో 50 స్థానాలకు 49 వైసీపీ ఏకగ్రీవంగా గెలుచుకుంది. ఒక స్థానాన్ని టీడీపీ గెలుచుకుంది. తంబళ్లపల్లె నియోజకవర్గంలో 73 ఎంపీటీసీ స్థానాలకు గానూ 72 వైసీపీ ఏకగ్రీవం చేసుకుంది. ఒక స్థానంలో ఇండిపెండెంట్ గెలిచారు. పీలేరు నియోజకవర్గంలో 59 ఏకగ్రీవం అయ్యాయి. 23 స్థానాల్లో ఎన్నికలు జరిగాయి. రాయచోటి నియోజకవర్గంలో 61 స్థానాలు వైసీపీ ఏకగ్రీవం చేసుకుంది. రాయచోటి మండలంలో ఒకటి, గాలివీడులో 2, లక్కిరెడ్డిపల్లెలో మూడు స్థానాలను టీడీపీ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచింది. రాజంపేట నియోజకవర్గంలో 69 స్థానాలకు గానూ 61 వైసీపీ ఏకగ్రీవం చేసుకుంది. ఎన్నికలు జరిగిన చోట తెలుగుదేశం రెండు, బీజేపీ ఒక చోట గెలిచింది. ఒంటిమిట్ట స్థానంలో ఏకగ్రీవంగా గెలిచిన ఆకేపాటి అమర్‌నాథరెడ్డి జడ్పీ చైర్మన్‌గా పని చేశారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో 74 స్థానాలకు గానూ 49 ఏకగ్రీవం చేసుకున్నారు. దీనిని బట్టి చూస్తే వైసీపీ హయాంలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఏమాత్రం ఉండేదో అర్థం అవుతుందని, అయితే ఇవేవీ గుర్తు లేనట్లు.. జగన్ అండ్ కో నేడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని పలువురు పేర్కొంటున్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల తనిఖీ


తహసీల్దారుతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ భావన

పెనగలూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాజంపేట సబ్‌కలెక్టర్ భావన గురువారం మండల రెవెన్యూ కార్యాలయ, మండల పరిషత్ కార్యాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయాల్లో రికార్డు గదులను, సిబ్బంది హాలును, పరిసర ప్రాంతాలను కలియదిరిగారు. రెండు కార్యాలయాల్లో సిబ్బందిని పరిచయం చేసుకుంటూ ఎవరెవరు ఏయే పనులు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట తహసీల్దారు అమరేశ్వరి, ఎంపీడీవో విజయరావు అన్నారు.

## చట్టంపై అవగాహన ఉండాలి

**జిల్లా సూక్ష్మనీటి సాగు అధికారిణి లక్ష్మిప్రసన్న**

రాయచోటి టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం-2005పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా సూక్ష్మ నీటి సాగు అధికారి లక్ష్మిప్రసన్న తెలిపారు. గురువారం రాయచోటి పట్టణ పరిధిలోని ఏపీఎంఐపీ జిల్లా కార్యాలయంలో క్షేత్రస్థాయి సిబ్బంది, ఇంజనీర్లు, జిల్లా కో-ఆర్డినేటర్స్, కంప్యూటర్ ఆపరేటర్లకు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 సంవత్సరం మే నెలలో పార్లమెంట్‌లో ఆమోదం పొంది అమల్లోకి వచ్చిందన్నారు. ఈ సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రతి అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడం కోసం అధికార యంత్రాంగం అదుపులో ఉన్న సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు తీసుకొచ్చారన్నారు. అదేవిధంగా పౌరులకు ముఖ్యమైన ఆయుధం అని, ఈ చట్టాన్ని ఉపయోగించి ప్రజలు హక్కులను కాపాడుకోవచ్చని తెలిపారు.

## అసంపూర్తి ఇళ్లను త్వరగా పూర్తి చేయండి

**కొత్తపల్లె గృహ లబ్ధిదారులతో సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి ● తహసీల్దారు కార్యాలయాల తనిఖీ**

కలికిరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లె గృహ నిర్మాణ కాలనీలో ఇళ్లను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి ఆదేశించారు. మండలంలో పలు చోట్ల ఆమె పర్యటించారు. ఎమ్మార్వో కార్యాలయంలో ఉద్యోగుల పని తీరు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. కుల ధృవీకరణలాంటి ధృవ పత్రాలను వెంటనే జారీ చేయాలన్నారు. కలికిరి-3 సచివాలయాన్ని సందర్శించి ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. ఉద్యోగుల హాజరు, ఇతర రికార్డుల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. కలికిరి కొత్తపల్లె గృహ నిర్మాణ కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడారు. నాలుగేళ్లగా మొండి గోడల స్థాయిలోనే వున్న ఇళ్లను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీ ఆధ్వర్యంలోని చెత్త సంపద (డంపింగ్ యార్డు) కేంద్రం నిర్వహణను పరిశీలించారు. చెత్త ద్వారా వర్మీ కంపోస్టు తయారీకి చేపట్టిన చర్యలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీఓ రియాజుద్దీన్ అహ్మద్, తహసీల్దారు హరికుమార్, డీటీ సయ్యద్ పంచాయతీ కార్యదర్శి జి.అశోక్, హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


కలికిరిలో ఇళ్లను పరిశీలించి సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ కళ్యాణి

### తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

రామసముద్రం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ కళ్యాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి రెవెన్యూ సమస్యలపై తహసీల్దార్ మహ్మద్ అజారుద్దీన్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రతి సోమవారం రెవెన్యూ సమస్యలపై అర్జీలన్నింటినీ త్వరగా పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ వశీం అహ్మద్, సీనియర్ అసిస్టెంట్ రెడ్డెప్ప, మండల సర్వేయర్ నరేంద్ర, వీఆర్వోలు రెహ్మాన్, జగదీష్, రఘురామ్, అనూష, మమత, భారతి, గౌరీ, అనూష, సునీత, రమణ సిబ్బంది పాల్గొన్నారు.

### రీసర్వే పక్కాగా నిర్వహించాలి

నిమ్మనపల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో జరగుతున్న రీ-సర్వే పక్కాగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆమె ప్రభుత్వం విడుదల చేసిన అన్నదాత సుఖీభవ నిధులు రైతులకు చేరాయా అని వాకబు చేశారు. సిబ్బంది సూచించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

అనంతరం పీజీఆర్ఎస్ కార్యక్రమం తప్పకుండా నిర్వర్తించి రైతుల సమస్యను తీర్చాలన్నారు. రెవెన్యూ సిబ్బంది రీ-సర్వేలో అలసత్వం వహిస్తుండడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రీసర్వేలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తపస్విని, సర్వేయర్ గోపి, సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటు బాధిత కుటుంబానికి రూ.4 లక్షలు విడుదల

కలికిరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గత ఏప్రిల్ నెలలో పిడుగుపాటుకు గురై మరణించిన కడప జిల్లాకు చెందిన ఒక బాధిత కుటుంబానికి ప్రతిపాదనలు అందిన కేవలం వారం రోజుల్లోనే రూ.4 లక్షల పరిహారాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె గ్రామ పంచాయతీలోని మీనాపురం గ్రామానికి చెందిన పెద్దమైసూరయ్య కుమారుడు చిట్టిబోయిన మునుస్వామి గత ఏప్రిల్ 30న పిడుగుపాటుకు గురయి మృతి చెందాడు. దీనికి సంబంధించి ఈ నెల 6న జిల్లా కలెక్టరు పరిహారం విడుదల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రతిపాదనలందిన వెంటనే పరిహారం విడుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అన్ని ఆనవాయితీలను పూర్తి చేసి మునుస్వామి కుటుంబానికి పరిహారం అందజేయడానికి గురువారం విపత్తు సహాయ నిదుల నుంచి రూ.4 లక్షలు మంజూరు చేసి విడుదల చేసింది. జిల్లా కలెక్టరు తగిన చర్యలు తీసుకుని వెంటనే బాధిత కుటుంబానికి పరిహారం నిదులు బ్యాంకు ఖాతా ద్వారా నేరుగా చెల్లించాల్సిందిగా ఆదేశిస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి గురువారం ఆదేశాలు జారీ చేశారు.

## నిత్యపూజకోన అభివృద్ధికి కృషి

**● ఇన్‌చార్జి ఈవో శ్రీధర్**


దారిలో ఉన్న బండరాళ్లను చూపుతున్న ఇన్‌చార్జ్ ఈవో

సిద్దవటం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): లంకమల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజేశ్వరకోనలోని అటవీ ప్రాంతంలో శివ భక్తులు కాలినడకన నడుచుకుంటూ వెళ్లే రహదారి అభివృద్ధికి కృషి చేస్తానని ఇన్‌చార్జి ఈవో శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన సిద్దవటంలో గురువారం ఇన్‌చార్జి ఈవో మాట్లాడుతూ నిత్యపూజకోనలోని పంచలింగాల గుడి వద్ద నుంచి అటవీ ప్రాంతంలో కాలినడకన భక్తులు దర్శనానికి వెళ్లే రహదారి దాదాపు 3 కి.మీ. మేర పెద్ద పెద్ద బండలు ఉన్నాయన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాల్లో శివదర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు వస్తారని, గత ఏడాది జరిగిన ఉత్సవాల్లో రహదారి సరిగా లేక భక్తులు ఇబ్బంది పడినట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. కాలినడకన వెళ్లే రహదారి ఏనుగులు గుంత సమీపాన పెద్ద పెద్ద గుండ్లు రహదారికి అడ్డంగా ఉన్నాయని ఫారెస్ట్ అధికారుల అనుమతులు తీసుకొని రహదారి అభివృద్ధికి సహకరిస్తానని ఇన్‌చార్జ్ ఈవో శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ సిబ్బంది చంద్ర పాల్గొన్నారు.

## 500 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ


జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న దృశ్యం

నందలూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ జాతీయ జెండాలను నిషేదించాలని ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలని సమాజ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు, అడ్వకేట్ వాండ్రాసి పెంచలయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి 500 అడుగుల భారీ జాతీయ జెండాతో జూనియర్ కళాశాల నుంచి అరవపల్లెలోని ఆర్‌అండ్‌బి బంగ్లా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ ప్లాస్టిక్ తయారు చేసిన జాతీయ జెండాలను వినియోగించరాదని జాతీయ జెండా ప్రాముఖ్యత కాపాడటం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. ప్రతిఒక్కరిలో చైతన్యం రావాలని జాతీయ భారీ జెండాతో ర్యాలీ నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, సమాజ సేవా సమితి విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శి ఎస్‌కే జావిద్‌బాషా, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏపీఎంపై దాడి కేసులో ఇరువురి అరెస్టు

గుర్రంకొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఏపీఎం రజనీకుమారిపై దాడి చేసిన కేసులో ఇద్దరు నిందితులను గురువారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు. 12వ తేదీ విధి నిర్వహణలో ఉన్న ఏపీఎం రజనీకుమారిపై గుర్రంకొండ సంఘమిత్ర-3 పరిధి మహిళలు దాడి చేసి గాయపరచడంతో పోలీసులు ఆరుగురిపై కేసు నమోదు చేశారు. కేసులో నిందితులైన శేఖర్, గంగిరెడ్డిని మార్కెట్ యార్డు వద్ద అరెస్టు చేసి వీరిని రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి


దేవేంద్ర (ఫైల్)

రాజంపేటటౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల పరిధిలోని కొత్తబోయనపల్లెలో గురువారం తెల్లవారుజామున కారు ఢీకొని బీటెక్ విద్యార్థి దేవేంద్ర(19) మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. కొత్తబోయనపల్లెలో అన్నమాచార్య యూనివర్శిటీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న రాయచోటికి చెందిన దేవేంద్ర, తాడిపత్రికి చెందిన ఇశ్వాంత్, మరో విద్యార్థి కలిసి ఖర్చుల నిమిత్తం బుధవారం సాయంత్రం ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో క్యాటరింగ్ నిర్వహించేందుకు వెళ్లారు. పని పూర్తయిన తర్వాత విద్యార్థులు ఇద్దరు కలిసి బోయనపల్లెకు తిరిగి నడుచుకుంటూ వెళుతున్న సమయంలో రాజంపేట నుంచి నందలూరు వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో దేవేంద్ర అక్కడికక్కడే మృతిచెందగా ఇశ్వంత్‌కు గాయాలు కావడంతో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## కారు ఢీ... ఇద్దరు యువకులకు గాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకులు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఏపీ- కర్ణాటక రాష్ట్ర సరిహద్దులోని రాయల్పాడు సమీపం గెజ్జనూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మదనపల్లె మండలం, చీకలబైలుకు చెందిన ఇద్దరు యువకులు గాయపడ్డారు. గురువారం కర్ణాటక రాష్ట్రం లో టైల్స్ పనికి వెళ్లి ఇంటికి బైక్‌పై తిరిగి వస్తున్న యువకులను మదనపల్లె నుంచి బెంగళూరు వైపు వెళుతున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యువకులు రాజన్న (30), శశికుమార్(26) గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు రాయల్‌పాడు పోలీసులు కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ఇద్దరు ఏజీపీల తొలగింపు

**ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**

కలికిరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రెండు కోర్టుల్లో ప్రభుత్వ సహాయ న్యాయవాదులు (ఏజీపీ)గా పనిచేస్తున్న ఇద్దరిని తొలగిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మదనపల్లె రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో ఏజీపీగా ఉన్న ఆర్.షాజహాన్, కడప జిల్లా మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పనిచేస్తున్న వి.జె.ఎన్.శర్మల సేవలను ఉపసంహరిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. మూడేళ్ల కాల వ్యవధితో 2022 సెప్టెంబరు 27వ తేదీ నియమించిన ఈ ఇద్దరు ఏజీపీలను పాలనాపరమైన సౌలభ్యం కోసం గడువులోగా తొలగిస్తున్న కారణంగా నిబంధనల ప్రకారం ఒక నెల ముందస్తు గౌరవ వేతనాన్ని చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. అంతేగాకుండా కేసులకు సంబంధించి ఎలాంటి ఆటంకం తలెత్తకుండా సమీప కోర్టుల్లోని ప్రభుత్వ న్యాయవాదులను ఇన్‌చార్జ్‌లుగా నియమించాలని కూడా ప్రభుత్వం సూచించింది. ఈ ముగ్గురి స్థానాల్లో కొత్త ఏజీపీల భర్తీ కోసం తగిన అభ్యర్థుల ప్యానల్ జాబితాను కూడా త్వరగా సమర్పించాలని కలెక్టర్లను ఆదేశిస్తూ ప్రభుత్వ న్యాయ, శాసన వ్యవహారాల శాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి ఆదేశాలు జారీ చేశారు.

## దళారులు మారరంతే...

- బొప్పాయి టన్ను రూ. 7 నుంచి 8 వేలు
- ధరలు తగ్గించి కొంటున్న దళారులు
- ధరలపై హెల్ప్‌లైన్‌కు రైతుల ఫిర్యాదులు
- ప్రతిరోజూ చెక్‌పోస్టుల వద్ద అధికారుల తనిఖీలు

రైల్వేకోడూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బొప్పాయి ధరలపై రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధ, గురువారాలలో 7 మంది రైతులు హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేశారని కార్యాలయం అధికారులు తెలిపారు. ఫిర్యాదు చేసిన రైతులు లారీ నెంబర్లు, దళారుల ఫోన్ నెంబర్లు, రైతుల ఫోన్ నెంబర్లతో పాటు భూమి సర్వే నెంబర్లతో ఫిర్యాదు చేశారు. బొప్పాయి కాయలను టన్ను రూ.7 వేలకు తీసుకున్నారని తెలిపారు. దీనిపై సబ్ కలెక్టర్ రైల్వేకోడూరు రెవెన్యూ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖలకు చెందిన అధికారులతో చర్చించారు. హెల్ప్‌లైన్‌లో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సబ్ కలెక్టర్‌కు నివేదిక అందిస్తున్నారు. కొందరు దళారులు టన్ను రూ.7 వేలు, మరికొందరు టన్ను రూ.8 వేలతో బొప్పాయి కాయలను కోస్తున్నారని హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేస్తున్నారని కార్యాలయం అధికారులు చెబుతున్నారు. చాలామంది రైతులు దళారుల దగ్గర ముందస్తుగా డబ్బులు తీసుకున్నారు. దీంతో భయపడి తక్కువ రేటుకైనా కాయలను అమ్ముకుంటే సొమ్ము అవుతుందని కోతలు చేయిస్తున్నారు. గట్టిగా వాదించే రైతుల తోటల్లో దళారీలు కోతలు కోయడం లేదని రైతులు వాపోతున్నారు. కోతలు పూర్తయిన తర్వాత దళారులు లెక్కలు చూస్తారు. చాలామంది దళారులు లెక్కలు వేసినప్పుడు టన్ను రూ.9 వేలతో కట్టిస్తామని చెబుతున్నారని, కొందరు రూ.7 వేలు, రూ.8 వేలతో చీటీలు రాయిస్తున్నారని రైతులు తెలిపారు. చాలా మంది రైతుల తోటల్లో కాయలు ఎక్కడ మాగిపోతాయన్న ఆలోచనతో ఎంత ధరకైనా సరే కోతలు చేయాలని దళారులకు చెబుతున్నారని తెలిసింది. దళారుల దగ్గర అప్పులు తెచ్చిన రైతులు మాత్రం నోరుమెదపడం లేదు. కలెక్టర్ చామకూరి శ్రీధర్ టన్ను బొప్పాయి కాయలను రూ. 9 వేలకు తక్కువ లేకుండా కోతలు కోయాలని చెప్పినా 75 శాతం ఫలితం ఉన్నా మరో 25 శాతం దళారులు వినకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు చెబుతున్నారు. బొప్పాయి రైతుల కోసం సబ్ కలెక్టర్ భావన హెల్ప్‌లైన్ ఏర్పాటు చేస్తే దళారులకు భయపడిన చాలామంది రైతులు ఫిర్యాదు చేయడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. దళారులు వచ్చే ఏడాదిలో ముందస్తుగా అప్పులు ఇవ్వరని, గింజలు ఏర్పాటు చేయరని రకరకాలుగా రైతులను ఇబ్బందిపెడతారన్న భయంతో దళారులతో రైతులు చేతులు కలపక తప్పడం లేదని వినిపిస్తోంది. గత ఏడాది రోజుకు 200 లారీల్లో ఇతర నగరాలకు బొప్పాయి కాయలను ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం 60 నుంచి 70 లారీల్లో కాయలను ఎగుమతి చేస్తున్నారు. కాగా వచ్చే ఏడాది బొప్పాయి వ్యాపారం తారుమారుగా ఉండవచ్చని చాలామంది రైతులు చెబుతున్నారు. రైతులను ఇబ్బంది పెట్టే వాతావరణం ఉండవచ్చునని అంటున్నారు. రెవెన్యూ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖల అధికారులు, సిబ్బంది ప్రతి రోజు బొప్పాయి లారీలను తనిఖీ చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఢిల్లీలో వర్షాలు కురుస్తున్నాయని అందువల్ల ధరలు తగ్గుముఖం పడుతున్నాయని దళారులు అంటున్నారు. ఢిల్లీ మార్కెట్ మూడు రోజుల పాటు బంద్ అవుతుందని పంపిన కాయలు కుళ్లిపోతాయని వారు అంటున్నారు. వ్యాపారం పుంజుకుంటే ధరలు పెరుగుతాయని అంటున్నారు. ఇక అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది వేచిచూడాల్సి ఉంది.






లారీకి లోడింగ్ చేసిన బొప్పాయి కాయలు చిట్వేలి-రాపూరు సరిహద్దు చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

### ధర తగ్గిందంటూ ప్రచారం చేస్తే కఠిన చర్యలు

**● సబ్ కలెక్టర్ భావన**

రాజంపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : బొప్పాయి కాయల ధరలు తగ్గాయంటూ తప్పుడు ప్రచారం చేసిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టర్ హెచ్ఎస్ భావన హెచ్చరించారు. గురువారం ఆమె మాట్లాడుతూ కిలో బొప్పాయిని రూ.9 నుంచి 10 రూపాయలకు కొనడానికి వ్యాపారులు సిద్ధంగా ఉన్నారన్నారు. అయితే కొందరు దళారులు 7 రూపాయలకు పడిపోతుందంటూ ప్రచారం చేయడం తగదన్నారు. ఈ విధంగా రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటర్‌కు తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా ధర తక్కువకు అడిగితే హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసిన వెంటనే వారికి న్యాయం చేస్తామని తెలిపారు.

# పాత రేషన్ కార్డులకు స్వస్తి

- ఇక జిల్లాలో 5,78,841 స్మార్ట్ కార్డులు
- ఈనెలాఖరులోగా పంపిణీకి కసరత్తు
- సెప్టెంబరు 1 నుండి సరుకుల పంపిణీ

కడప కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల శాఖలో సమూల మార్పులకు కూటమి సర్కారు శ్రీకారం చుట్టింది. పేదలకు సబ్సిడీ బియ్యం, సరుకులు పారదర్శకంగా, సులభతరంగా సకాలంలో అందించేందుకు చర్యలు చేపట్టింది. గత జగన్ పాలనలో అనాలోచిత చర్యలకు రేషన్‌కార్డు లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. ఇంటి వద్దకే బియ్యం పథకం పేరుతో ఏర్పాటు చేసిన ఎండీయూ వాహనాల ద్వారా సరుకుల పంపిణీ అట్టర్‌ప్లాప్ అయింది. అప్పట్లో జారీ చేసిన రేషన్ కార్డులపై వైసీపీ ప్రచార పిచ్చిలో ఒక పక్క జగన్‌బొమ్మ, మరో పక్క ఆయన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిల బొమ్మలతో ముద్రించారు. అంతేకాకుండా లబ్ధిదారుల ఫొటో, పేర్లు కనిపించడం కష్టంగా ఉండేది. ఇలాంటి విధానాలపై దృష్టి సారించిన ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు పేదలకు పారదర్శకంగా బియ్యం, సరుకులు అందించేందుకు వీలుగా డిజిటల్ స్మార్ట్ కార్డుల ఇచ్చేం దుకు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదేండ్ల మనోహర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో పాత రేషన్ కార్డులకు స్వస్థి పలుకు తూ ఆస్థానంలో జిల్లాలో 5,78,841 రేషన్‌కార్డు లబ్ధిదారులకు ఏటీ ఎం కార్డుల తరహాలో డిజిటల్ స్మార్ట్ కార్డుల పంపీణికీ కసరత్తు చేపట్టారు. ఈ నెలాఖరు 25 నుంచి 31లోగా జిల్లాలో పాత కార్డు దారులతో పాటు కొత్తగా అర్హత పొందిన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందించనున్నారు.




### డిజిటల్ స్మార్ట్ రేషన్‌కార్డు ఇలా...

ఇక డిజిటల్ స్మార్ట్ రేషన్‌కార్డు ఏటీఎం క్రెడిట్ కార్డు సైజ్‌లో క్యూ ఆర్ కోడ్‌తో ముద్రించారు. లబ్ధిదారులు బియ్యం, సబ్సిడీ సరుకులు తీసుకునే సమయంలో గతంలో సర్వర్ రాక ఈ పోస్ యంత్రాలతో ఇబ్బందులు ఉండేవి. ఇపుడు బయోమెట్రిక్ లేకుండా నేరుగా స్మార్ట్ కార్డులోని నెంబరు నమోదు చేస్తే లబ్ధిదారుల పూర్తి వివరాలు రానున్నాయి. ఈవిధానంలో కార్డుదారులు వెంటనే సరుకులు పొందే వీలుంటుంది.

### జిల్లాలో కొత్తకార్డులు

జిల్లాలో 5,78,841 మంది లబ్ధిదారుల కుటుంబాలకు ప్రభుత్వం డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనుంది. వైసీపీ ప్రభు త్వంలో కొత్త రేషన్ కార్డులకు వేలాదిగా దరఖాస్తులు వచ్చినప్పటికీ కొత్తగా కార్డుల జారీ విషయంలో మీనామేషాలు వేసింది. దాదాపు రెండేళ్లపాటు నానబెట్టి పేదలను పథకాలకు దూరం చేసిందనే విమ ర్శలు ఉన్నాయి. 2024 ఎన్నికల ప్రక్రియ మొదలవ్వడంతో మెలిక పెట్టింది. నాటి నుంచి కొత్త రేషన్ కార్డులు, స్ప్లిట్టింగ్ కార్డులకు దర ఖాస్తులు క్రోడీకరించిన మీదట అర్హులుగా లెక్కించిన వారందరికీ చంద్రబాబు సర్కారు స్మార్ట్ కార్డులు అందజేయనుంది. ఇపుడు కూటమి సర్కారులో వచ్చిన 7,653 దరఖాస్తులను పరిశీలించి అర్హ త మేరకు 4,488 మందికి కొత్తగా రేషన్ స్మార్ట్ కార్డులందనున్నాయి. అలాగే స్ప్లిట్టింగ్ (సవరణలు, చేర్పులు, మార్పులు) కింద జిల్లాలో 10,269 దరకాస్తులు వచ్చాయి. అందులో 7453 కార్డులను సవరించి డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల రూపంలో అందించనున్నారు. ఈనెలా ఖరు నాటికి స్మార్ట్ కార్డుల పంపిణీ పూర్తయితే సెప్టెంబరు 1 నుంచి లబ్ధిదారులకు స్మార్ట్‌కార్డుల ద్వారా బియ్యం, సరుకులు పంపిణీ జరగనుంది.



### స్మార్ట్ రేషన్ కార్డులపై నేతల బొమ్మలకు చెక్

గతంలో జారీ చేసిన రేషన్ కార్డులపై రాజకీయ నేతల బొమ్మలతో రేషన్ కార్డులుండేవి. ఇపుడు ఆ విధానానికి కూటమి సర్కారు చెక్ పెట్టింది. స్మార్ట్ కార్డులపై రాజకీయ నేతల బొమ్మల స్థానంలో ప్రభుత్వ రాజముద్రతో పాటు లబ్ధిదారుల ఫొటో, కుటుంబ సభ్యుల వివరాలు స్పష్టంగా కనిపించేలా రేషన్‌కార్డులు ఇప్పటికే చెన్నై కేంద్రంగా ముద్రణ ప్రక్రియ పూర్తయినట్లు సవిల్ సప్లయ్ అధికా రులు చెబుతున్నారు. జిల్లాకు ఈ నెల 25 నుంచి 31 లోగా జిల్లా, మండలాల వారీగా నేరుగా స్టార్ట్ కార్డులను ప్రభుత్వం చేర వేయనుందన్నారు. ఈకార్డులన్నింటినీ సచివాలయ సిబ్బంది, అధికా రులు నేరుగా లబ్ధిదారుల ఇంటికే చేర వేయనున్నట్లు సమాచారం.

## భూ వివాదం కేసులో
# నలుగురికి జైలుశిక్ష

పోరుమామిళ్ల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): భూవివాదం కారణంగా నమోదైన ఓ కేసులో నలుగురికి రెండేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి పద్మశ్రీ తీర్పు ఇచ్చినట్లు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. వారి వివరాల మేరకు... పోరుమామిళ్ల మండలంలోని చిన్నకప్పలపల్లెలో రెండు కుటుంబాల మధ్య భూ వివాదం నెలకొంది. ఈ కారణంగా అంకాల బంగారు పోలయ్య, వారి తల్లిదండ్రులను చంపాలనే ఉద్దేశ్యంతో అదే గ్రామానికి చెందిన అంకాల పోలయ్య, అంకాల పెద్దగురప్పడు, అంకాల గురప్పడు, అంకాల రామరాజు అనే వారు దాడి చేసి గాయపరిచారు. ఈ ఘట నకు సంబంధించి 2018లో నిందితులపై కేసు నమోదైంది. గురు వారం బద్వేలు కోర్టులో సివిల్ జడ్జి పద్మశ్రీ తుది విచారణ జరిపి నేరం రుజువు కావడంతో రెండేళ్ల జైలుశిక్ష, రూ.500 జరిమానా విధించారన్నారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలలు జైలుశిక్ష అనుభవించాలని తీర్పు చెప్పారని వారు తెలిపారు. ఈ కేసులో ప్రభుత్వ అడిషనల్ పీపీ శ్రీనివాసులుకు సరైన సాక్ష్యా లు సమర్పించి.. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన సీఐ శ్రీనివా సులు, ఎస్ఐ కొండారెడ్డి కోర్టు హెడ్‌కానిస్టేబులు శ్రీనివాసరెడ్డిని జిల్లా ఉన్నతాధికారులు అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


పాములేటి మృతదేహం

బ్రహ్మంగారిమఠం. ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరస న్నపల్లె గ్రామానికి చెందిన పాములేటి (44) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పాములేటి తన సొంత పని నిమిత్తం బైకుపై బజారుకు వెళ్లి తిరిగి వస్తుండగా.. మార్గమధ్యంలో ఎద్దుల బండి అడ్డురావడంతో సడెన్ బ్రేకు వేశాడు. దీంతో అదుపు తప్పి కింద పడడంతో హుటాహుటిన 108 వాహనంలో తరలించగా మార్గ మధ్యంలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడు పాములేటి ఇటీవల కువైట్‌కు వెళ్లి నెల క్రితం ఇక్కడకు వచ్చారని.. రెండు మూడు రోజుల్లో తిరిగి కువైట్ వెళ్లాల్సి ఉండగా ఈ సంఘటన జరిగిందని కుటుంబసభ్యులు బోరున విలపించారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## ఎర్రగుంట్ల పీహెచ్‌సీలో తనిఖీలు


రికార్డులు పరిశీలిస్తున్న జోనల్ మలేరియా అధికారి

ఎర్రగుంట్ల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల పీహెచ్‌సీని గురువారం మలేరియా జోనల్ అధికారి డాక్టర్ జమాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులను, ల్యాబ్ పార్మసీ గదులను పరిశీలించారు. మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున జ్వరాలు అధికంగా వస్తున్నాయని.. తగిన జాగ్రత్తలు తీసుకోవా లన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జోష్న, సూపర్‌వైజర్ ఓబులేసు సిబ్బంది పాల్గొన్నారు.

## తైక్వాండోలో బంగారు పతకాలు


తైక్వాండోలో పతకాలు సాధించిన క్రీడాకారులు

పోరుమామిళ్ల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో తైక్వాండో పోటీల్లో పోరుమామిళ్ల క్రీడాకారులు మంచి ప్రతిభను చాటి పతకాలు సాధించారు. తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 10వ జాతీయస్థాయి తైక్వాండో పోటీలు విజయవాడలో నిర్వహించారు. ఈ పోటీల్లో వారియర్స్ తైక్వాండో అకాడమీ క్రీడాకారులు ఫర్ మేన్, నాగదీపిక, హరిచరణ్, గురు జశ్వంత్, అయిల్ బంగారు పతకాలు, వైష్ణవి, షరీఫ్ రజత పతకాలు సాధించినట్లు అకాడమీ నిర్వాహకులు తెలిపారు.

## క్రీడా పాఠశాల ప్రవేశ ఫలితాలు విడుదల

కడప స్పోర్ట్స్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కడప వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో 4,5 తరగతుల ప్రవేశానికి సంబంధించి గురువారం ఫలితాలు విడుదల చేశారు. ఇటీవల నిర్వహించిన వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అర్హులుగా ప్రకటించారు. ఇందులో కడప జిల్లా నుంచి 16 మంది విద్యార్థినీ విద్యార్థులు ఎంపికయ్యారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఎంపి కైన విద్యార్థులు ఈనెల 21న గురువారం క్రీడాపాఠశాలకు హాజరై సంబంధిత డాక్యుమెంట్లు అందించాలని క్రీడాపాఠశాల ప్రత్యేక అధికారి జగన్నాథరెడ్డి తెలిపారు.

**ఎంపికైన 4,5 తరగతుల విద్యార్థులు వీరే..**

డి.అర్జున్, డి.మోక్షగణేశ్, దివాన్‌కైఫు, ఎం.జస్విక్, బి.విష్ణువర్ధన్‌రెడ్డి, ఇర్ఫాన్, కౌశల్ చంద్, ఏవీ విష్ణువర్ధన్‌రెడ్డి, టి.కశ్యప్, జి.దినేష్‌కుమార్, ఏఎం వైభవి, టీఎస్ నివేదిత, పి.హరిణి, వై.మోక్షిత, బి.నారాయణి ప్రియ, కె.లేవికారెడ్డిలు ఎంపికయ్యారు. అలాగే అన్నమయ్య జిల్లా నుంచి ఎ.వైష్ణవి, ఎం.గంగా హర్షిణి ఎంపికైన వారిలో ఉన్నారు.

## వర్ణకుమార్‌రెడ్డికి డాక్టరేట్



పులివెందుల రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పి.జి.వర్ణకుమార్‌రెడ్డికి డాక్టరేట్ దక్కింది. చెన్నైలోని వేల్స్ యూని వర్సిటీలో ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ ఎం.మీనా ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ రేడియో టెస్ట్‌బెడ్ ఉపయోగించి ఆటోమేటిక్ మాడ్యులేషన్ క్లాసిఫికేషన్ కోసం మిషన్ లెర్నింగ్ మరియు డీప్ లెర్నింగ్ అల్గోరిథమ్‌ల అభివృద్ధి అనే అంశంపై ఆయన పరిశోధన పూర్తిచేశారు. ఈ పరిశోధనలో, ఆధునిక వైర్‌లెస్ కమ్యూనికేషన్ వ్యవస్థల్లో మాడ్యులేషన్ గుర్తింపుని వేగవంతం చేయడం, ఖచ్చితత్వం పెంచడం, సాఫ్ట్ వేర్ డిఫైన్డ్ రేడియో (ఎస్‌డీఆర్) ఆధారిత పరీక్ష వేదిక ద్వారా వాస్తవ పరిసరాలలో ఈ అల్గో రిథమ్‌ల పనితీరును పరీక్షించారు. ఇందుకు ఆయన డాక్టరేట్ అందుకున్నారు. ఈసందర్భంగా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఆయనను అభినందించారు.

# బ్యాండ్ బాజాలు మోగిస్తే నికాహ్ చేయం

## మత గురువుల తీర్మానం

రాయచోటిటౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఇస్లాం మతానికి విరుద్ధమైన బ్యాండు బాజాలు మోగించడం, ఆర్కెస్ట్రా పెట్టడం, బాణాసంచాలు కాల్చడం, ట్రాన్స్‌జెండర్స్ లాంటి వ్యక్తులతో డ్యాన్సులు నిర్వహిస్తే అలాంటి పెళ్లిలో నికాహ్ చేయమని రాయచోటి పట్టణ సర్కాజీలు తీర్మానించారు. బుధవారం రాత్రి పట్టణంలోని పాతరాయచోటి మసీదులో మత గురువు షర్ఫుద్దీన్ ఆధ్వర్యంలో సర్కాజీలు మౌలానీ సలీం, ముఫ్తీ హబీబుర్ రెహమాన్, మౌలానా షబ్బీర్, మౌలానా అబ్దుల్ వాహిద్, హఫీజ్ అమీనుల్లాలు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ఇస్లాం మతానికి పూర్తి విరుద్ధంగా ముస్లింలు పెళ్లిళ్ల నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాండు బాజాలు, బాణాసంచాలు, ఆర్కెస్ట్రా, ట్రాన్స్‌జెండర్లతో డాన్సులు నిర్వహించడం వంటి కార్యక్రమాలతో డబ్బు వృథా కావడమే కాకుండా ఇస్లాం మతానికి విరుద్ధమని, ఇలాంటి సాంస్కృతి కొనసాగిస్తే పేద ముస్లింల పెళ్లిళ్ల జరగడం కష్టతరం అవుతుందన్నారు. చాలామంది పేద కుటుంబాల్లో పెళ్లిళ్ల జరగక పోవడం వంటి ఘటనలు జరుగుతున్నాయని వారు ఆవేదన చెందారు. దీనికి రాయచోటిలో ఇద్దరు అక్కచెల్లెళ్ల ఆత్మహత్య చేసుకోవడమే నిదర్శమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నేతలు బుల్లెట్ మహబూబ్‌బాషా, జిన్నాషరీఫ్, ఆడిటర్ మన్సూర్‌అలీఖాన్, సయ్యద్ రియాజుద్దీన్, చెన్నూరు మస్తాన్‌వలి పాల్గొన్నారు.

# టిప్పర్ ఢీ.. ఇద్దరు మహిళల మృతి

- శుభకార్యానికి వెళుతుండగా ప్రమాదం
- మృతులు అన్నదమ్ముల భార్యలు

ఎర్రగుంట్ల / ముద్దనూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): శుభకార్యానికి వెళుతూ అన్నదమ్ముల భార్యలు దుర్మరణం చెందిన సంఘటన గురువారం కల మల్ల వద్ద చోటుచేసుకుంది. కలమల్ల ఎస్ఐ సునీల్ కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు ముద్దనూరు మండలంలోని కొసినేపల్లికి చెందిన వెంకటేష్, వెంకటరమణలు తమ భార్యలతో కలిసి మోటార్‌సైకిళ్లలో పెళ్లికి వెళ్లేందుకు ఎర్రగుంట్లకు బయలుదేరారు. మార్గమధ్యలో కలమల్ల వంకపై నిర్మించిన బ్రిడ్జి వద్ద కు వెళ్లగానే ఫ్లయాష్‌తో వెళుతున్న టిప్పర్ ఢీకొంది. దీంతో వెంకటేష్ భార్య గుడ్డోళ్ల గాయత్రి (25), వెంకటరమణ భార్య గుడ్డోళ్ల సుహాసిని (35) టిప్పర్ కిందపడటంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందారు. గాయత్రి తల నుజ్జునుజ్జు అయ్యింది. వెంకటేష్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించినట్లు సమాచారం. టిప్పర్ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

**మృతుల బంధువుల ఆందోళన :** వెంకటరమణ, వెంకటేష్‌లు ఆర్టీపీపీలో పనిచేస్తున్నారు. వారిద్దరి భార్యలు మృతి చెందడంతో బంధువులు అక్కడకు చేరుకొని బోరున విలపించారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని బంధువులు ఆందోళనకు దిగారు. దీంతో మూడు గంటలపాటు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. టీడీపీ, వైసీపీకి చెందిన నాయకులు, ఆర్టీపీపీ ఉద్యోగకార్మికులు పెద్దఎత్తున సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి అక్కడకు చేరుకుని టిప్పర్ యజమానితో మాట్లాడి పరిహారం ఇప్పించేందుకు ఒప్పించడంతో ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


ప్రమాదంలో మృతి చెందిన సుహాసిని, గాయత్రి (ఫైల్ ఫొటోలు)


మృతదేహం వద్ద గుమికూడిన బంధువులు, ఆర్టీపీపీ ఉద్యోగులు

**కొసినేపల్లిలో విషాదఛాయలు**

ముద్దనూరు మండలం కొసినేపల్లి గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలోని అన్నదమ్ముల భార్యలు సుహాసిని, గాయత్రిలు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకొన్నాయి. గాయిత్రికి ఏడాదిన్నర కవలలు పిల్లలు ఉన్నారు. సుహాసినికి బీటెక్, ఇంటర్ చదివే కుమారులు ఉన్నట్లు బంధువులు తెలిపారు.

# పేస్ కళాశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన

- రెండు వర్గాలుగా విడిపోయిన డైరెక్టర్లు
- రోడ్డున పడిన విద్యార్థులు
- ఆందోళనకు సీపీఎం, విద్యార్థి సంఘాల మద్దతు


పేస్ కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పేస్ అకాడమి కళాశాలలో 45 రోజులుగా తరగతులు నిర్వహించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం కళాశాల వద్ద ఆందోళన నిర్వహించారు. పట్టణంలోని విద్యార్థులకు ఇంటర్మీడియట్‌లో నాణ్యమైన విద్యను అందించడానికి గత సంవత్సరం ఏడుగురు డైరెక్టర్లు కలిసి సాయిరాజేశ్వరి కాలనీలో పేస్ అకాడమిని ఏర్పాటు చేశారు. ఇంటర్‌తోపాటు ఐఐటీ, నీట్, జేఈఈ శిక్షణ ఇస్తామని చెప్పడంతో ఫీజులు అధికంగా ఉన్నా తల్లిదండ్రులు తమ పిల్లలను కళాశాలలో చేర్చారు. అయితే పేస్ అకాడమీకి ఇంటర్మీడియట్ బోర్డు నుంచి అనుమతి లేకపోవడంతో పరీక్షల సమయంలో విద్యార్థులకు ఇబ్బంది అవుతుందన్న ఉద్దేశ్యంతో టాప్‌మైండ్ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. అయితే పేస్ అకాడమీ పేరుతోనే ఇంటర్మీడియట్ తరగతులను నిర్వహిస్తూ ఐఐటీ, నీట్, జేఈఈ శిక్షణ ఇస్తున్నారు. ఇటీవల కళాశాల డైరెక్టర్ల మధ్య బేదాభిప్రాయాలు రావడంతో డైరెక్టర్లు రెండు వర్గాలుగా చీలిపోయారు. కొందరు డైరెక్టర్లు పేస్ అకాడమిని, కొందరు అధ్యాపకులను కళాశాలలోని ఫర్నీచర్ మరో చోటికి తరలించారు. తల్లిదండ్రుల ఆందోళనతో కళాశాలలో ఉన్న లొసుగులుగా వెలుగుచూశాయి. టాప్‌మైండ్ కళాశాలకు ఇంటర్మీడియట్ బోర్డు అనుమతి ఉన్నా ఐఐటీ, నీట్, జేఈఈ శిక్షణ ఇవ్వకపోవడం ఇబ్బందిగా మారింది. మరోపక్క పేస్ అకాడమి డైరెక్టర్లు ఐఐటీ, నీట్, జేఈఈ శిక్షణ ఇస్తామని పిల్లలను తమ వద్దకు పంపాలని ఒత్తిడి చేస్తున్నారు. అయితే పేస్ అకాడమికి ఇంటర్మీడియట్ బోర్డు అనుమతి లేకపోవడంతో తల్లిదండ్రులు ఎటు తేల్చుకోలేని స్థితిలో ఉన్నారు. ఇంటర్‌తోపాటు ఇతర ప్రవేశ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ఎక్కువ ఫీజులు చెల్లించి పిల్లలను పేస్ అకాడమిలో చేర్పించామని... డైరెక్టర్లు తమకు అన్యాయం చేశారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విద్యాసంవత్సరం వరకు డైరెక్టర్లు అందరు కలిసి తమ పిల్లలకు న్యాయం చేయాలని కోరుతున్నారు. వీరి ఆందోళనకు సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, ఏఐఎస్ఎఫ్ నాయకులు పీటర్, పీడీఎస్‌యూ మాజీ నాయకుడు ఓబులేసులు సంఘీభావం తెలిపారు.

# మిన్నంటిన టీడీపీ సంబరాలు

● పులివెందుల ప్రజలకు ముందే స్వాతంత్ర్యం వచ్చింది ● గ్రామ గ్రామానా బాణసంచా పేలుళ్లు ● కేక్‌లను కట్ చేయించిన నేతలు
● ప్రజల తీర్పు జగన్‌కు చెంపపెట్టు ● సుపరిపాలనకు ప్రజలు ఓట్లేశారు : తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి





ములకలచెరువులో విలేకరులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి - తంబళ్లపల్లెలో బాణసంచా పేల్చి సంబరాలు చేసుకుంటున్న టీడీపీ శ్రేణులు

ములకలచెరువు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వైఎస్ కుటుంబానికి కంచుకోటగా నిలిచిన పులివెందులలో టీడీపీ విజయఢంకా మోగించడం, పులివెందుల ప్రజల తీర్పు జగన్‌కు చెంపపెట్టు అని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి అన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించడంతో గురువారం నేతలు, కార్యకర్తలతో కలిసి సంబరాలు చేసుకున్నారు. భారీ ఎత్తున బాణసంచా పేల్చి కేక్‌ను కట్ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల ప్రజలకు ఒక రోజు ముందే స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. జగన్‌పై ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందో పులివెందుల తీర్పే నిదర్శనమన్నారు. 30 ఏళ్ల తరువాత ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఎన్నికల్లో ప్రజలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సుపరిపాలనకు ఓట్లేశారన్నారు. పులివెందులలో వైసీపీ అభ్యర్థికి డిపాజిట్ కూడా ఇవ్వకుండా తగిన బుద్ధి చెప్పారన్నారు. గతంలో జరిగిన జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచుల ఎన్నికల్లో పోలీసులను అడ్డుపెట్టుకుని టీడీపీ నేతలు నామినేషన్లు చించి రౌడీయిజం చేసి దౌర్జన్యంగా ఏకగ్రీవం చేసుకున్న విషయం ప్రజలు ఇంకా మరిచిపోలేదన్నారు. రానున్న స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికలు జరిపి టీడీపీ జెండా రెపరెపలాడిస్తామన్నారు. టీడీపీ జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రమణ, నేతలు తులసీధర్‌నాయుడు, గంజి మోహన, ప్రభాకర్‌రెడ్డి, సుబ్బ నాయుడు, కట్టా హరినాథ్, నాగిరెడ్డి, పాస్టర్ శ్రీనివాసులు, రమణారెడ్డి, నీలకంఠారెడ్డి, శంకర పాల్గొన్నారు.

## బీటలు బారిన జగన్ కోట...

నిమ్మనపల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జగన్ కంచుకోటకు బీటలుబారాయని క్లస్టర్ ఇన్‌చార్జి మునిరత్నం అన్నారు. పులివెందుల జడ్పీటీసీకి డిపాజిట్లు కూడా రాకపోవడం, ఒంటిమిట్ట జడ్పీటీసీ సానాల్లో టీడీపీ విజభేరి మోగిచడంతో టీడీపీ నేతలు బస్టాండులో బాణసంచాపేల్చి సంబరాలు చేసుకున్నారు. పులివెందుల ప్రజలు స్వేచ్ఛ కోరుకుని స్వచ్ఛందంగా ఓటు వేసి టీడీపీకి పట్టంకట్టినట్లు తెలిపారు. రాబోయే ఎన్నికలకు ఇది పునాదిలాంటిదని తెలిపారు. యవత అధ్యక్షుడు చినబాబు, విజయ్, మురళి, సూర్యప్రకాష్, రాజన్న, చంద్రాయుడు, లక్ష్మన్న, భూపతి పాల్గొన్నారు.

## గుర్రంకొండలో సంబరాలు

గుర్రంకొండ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడంతో గుర్రంకొండలో టీడీపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. బస్టాండులో బాణసంచా పేల్చారు. కార్యక్రమంలో నేతలు జగదీష్, చంద్రబాబు, చలమారెడ్డి, నౌషాద్‌అహ్మద్, సుధాకర్, మహాత్మారెడ్డి, సాగర్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## దద్దరిల్లిన హరిత కూడలి

తంబళ్లపల్లె, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించడంతో టీడీపీ శ్రేణులు విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని హరిత కూడలి వద్ద పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి ప్రజలకు స్వీట్లు పంచిపెట్టారు. ప్రభుత్వ పాలనను ప్రజలు మెచ్చి ఇచ్చిన తీర్పు పులివెందుల జడ్పీటీసీ గెలుపన్నారు. ఈ విజయం ముమ్మాటికీ అభివృద్ధిని కోరుకునే ప్రజలదని, అభివృద్ధికి అడుగులు నేర్పుతున్న టీడీపీదే అన్నారు. టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు ఉత్తమ్‌రెడ్డి, మల్లయ్యకొండ మాజీ చైర్మన్ గంగులప్పరెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రామచంద్ర, ఎస్ఎంసీ చైర్మన్లు వీరాంజనేయులు, శివ, నరేంద్ర నాయుడు, కాలా నారాయణ, సుధాకర్‌రెడ్డి, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## పరిఢవిల్లిన ప్రజాస్వామ్యం

పీలేరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందులలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లిందని జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి కోటపల్లె బాబు రెడ్డి అన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు అపూర్వ విజయం సాధించడంతో పీలేరులోని టీడీపీ శ్రేణులు ఘనంగా సంబరాలు చేసుకున్నాయి. టీడీపీ నేతలు స్వీట్లు పంచడమే కాక బాణ సంచా పేల్చి తమ హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ అధికారంలో ఉండగా స్థానిక సంస్థల ఎన్నికల కోసం వైసీపీ నేతలు సాగించిన దమ నకాండ రాష్ట్ర ప్రజలు మరిచిపోలేదన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పటికీ ఎటువంటి అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడకుండా ప్రజా స్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించి స్పష్టమైన ఓటరు తీర్పుతో రెండు జడ్పీటీసీ స్థానాలను కైవశం చేసుకుందన్నారు. కార్యక్రమంలో పీలేరు ఏఎంసీ అధ్యక్షులు పురం రామ్మూర్తి, డైరెక్టర్ పఠాన్ రహంతుల్లా, నేతలు పోలిశెట్టి సురేంద్ర, నాగేంద్ర, ఖాదర్, చంద్రమ్మ, సలీం, తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకిపురంలో కూటమి సంబరాలు

వాల్మీకిపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్టల్లో జరిగిన ఉపఎన్నికల్లో టీడీపీ ఘనవిజయం సాధించడం పట్ల పట్టణంలో కూటమి పార్టీల ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. స్థానిక గాంధీ బస్టాండ్ వద్ద నేతలు, కార్యకర్తలు బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. వైసీపీకి కంచుకోటకు బీటలు బారడం టీడీపీ జయకేతనం సీఎం నారా చంద్రబాబునాయుడు సుపరిపాలనకు నిదర్శనమన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుందంటే అది ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. అనంతరం ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటూ జైచంద్రబాబు నినాదాలతో హోరెత్తించారు. మార్కెట్ చైర్మన్ కోసూరి చంద్రమౌళి, నేతలు రాజేంద్రాచారి, పీవీ నారాయణ, బొక్కసం రామకృష్ణ, జాఫర్, చాను, రామాంజులరెడ్డి, డిష్ బ్రదర్స్, రామచంద్ర, కాలనీ రమేష్, ఆదినారాయణ, శివారెడ్డి, గంగులప్ప, దండువారిపల్లె రమణ, రామకృష్ణ, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీడీపీ శ్రేణుల సంబరాలు

కలకడ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు ఘనవిజయం సాధించడంతో ఆపార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. కలకడలో పార్టీ జెండాను ప్రదర్శిస్తూ మిఠాయిలను పంచారు. గెలుపుపొందిన అభ్యర్థులు మారెడ్డి లతారెడ్డి, ముద్దుక్రిష్ణారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నేతలు వై.జిలానీ, ముబారక్‌అలీ, నౌషాద్, ఇర్ఫాన్, ఖాజా, జాఫర్, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా ఏపీఎంపై దాడికి నిరసన



వాల్మీకిపురంలో నిరసన తెలుపుతున్న సెర్ప్ ఉద్యోగులు

వాల్మీకిపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మండలానికి చెందిన మహిళ ఏపీఎం రజనికుమారిపై దాడిని ఖండిస్తూ గురువారం వాల్మీకిపురం మండల వెలుగు (సెర్ప్) ఉద్యోగులు కార్యాలయ ఆవరణలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర యూనియన్ అధ్యక్షుడు, రాష్ట్ర జేఏసీ కార్యదర్శి ధనుంజయరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి దుశ్చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. విధులు నిర్వహిస్తున్న మహిళ ఏపీఎంపై మూకుమ్మడిగా నడిరోడ్డుపై దాడి చేయడం దారుణమన్నారు. బాధితులపై కఠిన చర్యలు తీసుకోవాలని నిరసన చేశారు.కలెక్టర్, ఎస్పీలు కఠిన చర్యలు చేపట్టి ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళ ఏపీఎంకు న్యాయం జరిగే వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ నేతలు సురేంద్ర, రెడ్డెప్ప, జిల్లా నేతలు నరోత్తమరెడ్డి, అనురాధ, శంకరయ్య, శ్రీనివాసులు, వెంకటపతి, భారతి, మహేశ్వరి, సుబ్రహ్మణ్యం, వెంకటరమణ, తులసి, రాజగోపాల్, బాబాసాహెబ్, ఆంజనేయులు, సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## రేపు జన్మాష్టమి వేడుకలు




మదనపల్లె అర్బన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అనపగుట్టలో శ్రీకృష్ణాలయంలో జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆలయం విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరణ ఉంటుందన్నారు. భక్తుల దర్శనం, రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణుడి కల్యాణోత్సవం, చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం జరుగునన్నారు. సాయంత్రం స్నపనోత్సవం, వసంతోత్సవం, అనంతరం ఉట్లోత్సవం నిర్వహిస్తామన్నారు.

## రేపు ఆడికృత్తిక మహోత్సవం

మదనపల్లె అర్బన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యం ఆలయంలో 15న కావళ్ల పండుగ, 16న ఆడికృతిక మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ధర్మకర్తలు రాచపల్లె సుబ్రహ్మణ్యం, అనురాధ తెలిపారు. భక్తులకు శనివారం ఉదయం స్వామి ప్రత్యేకాలంకరణలతో దర్శనం, ఉదయం నుంచే అన్నదానం నిర్వహించనున్నట్లు చెప్పారు.

## చేనేతలను ఆదుకుంటోంది ప్రభుత్వమే

మదనపల్లె టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేనేత రంగాన్ని, కార్మికులను ఆదుకుంటోంది కూటమి ప్రభుత్వమే అని టీడీపీ చేనేత విభాగం రాష్ట్ర నేత బొమ్మిశెట్టి పురుషోత్తం అన్నారు. నీరుగట్టువారిపల్లెలోని 34, 35 వార్డులో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే షాజహాన్‌బాష చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు సురేంద్ర, భాగ్యలక్ష్మి, రమేశ్ సురేష్, ఆదినారాయణ, ద్వారకనాథ్, కృష్ణమూర్తి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్ర, సాంకేతిక రంగాలతోనే దేశాభివృద్ధి

● ఐఎస్‌టీఈ సేవలు అభినందనీయం : వీసీ సుదర్శనరావు



వీసీ సుదర్శనరావు నుంచి ఐఎస్‌టీఈ అవార్డు అందుకుంటున్న కరెస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి

కురబలకోట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): శాస్త్ర, సాంకేతిక రంగాలతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని అనంతపురం జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు అన్నారు. గురువారం డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్సిటీలో ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఏపీ-2024 మిట్స్‌ను బెస్ట్ ఇంజనీరింగ్ కళాశాల అవార్డును ఎంపిక చేశారు. ప్రధానోత్సవ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు టెక్నాలజీ వైపు ముందుకెళ్లి నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సాంకేతిక రంగాల్లో వస్తున్న విప్లవాత్మక మార్పులకు తగ్గట్టు నూతన టెక్నాలజీపై పట్టు సాధించాలన్నారు. విద్యారంగంలో ఐఎస్‌టీఈ అందిస్తున్న సేవలు అభినందనీయమని ప్రశంసించారు. సాంకేతిక విద్య ప్రాముఖ్యత, భవిష్యత్‌లో టెక్నాలజీ అభివృద్ధి, సాంకేతికత నిపుణులను రూపొందించడలో ఐఎస్‌టీఈ స్ఫూర్తిదాయకమన్నారు. సాంకేతిక అభివృద్ధిలో క్వాంటమ్ కంప్యూటింగ్ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాంకేతికతపై ప్రోత్సాహకాలను అందజేస్తోందన్నారు. కరెస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థానానికి చేరుకోవచ్చన్నారు. విద్యార్థులు నూతన ఆలోచనలతో ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలన్నారు. జీవితంలో చిన్న, పెద్ద ఏ అవకాశాన్నీ వదలకుండా సద్వినియోగం చేసుకుని సమాజమార్గదర్శకులుగా ఎదగాలన్నారు. విద్యార్థుల కెరియర్‌లో టెక్నికల్ నైపుణ్యాలు ఎంతో కీలకమని దానిని దృష్టిలో ఉంచుకుని మెరుగుపరచుకోవడంతో పాటుగా మంచి రంగాన్ని ఎంచుకుని రాణించాలన్నారు.

## మిట్స్‌కు ఐఎస్‌టీఈ అవార్డు ప్రదానం

డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్సిటీకి ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఏపీ-2024గాను మిట్స్‌ను బెస్ట్ ఇంజనీరింగ్ కళాశాల అవార్డును అందించారు. కళాశాలలో అవార్డుల ప్రధానోత్సవం ఘనంగా నిర్వహించారు. అవార్డును వీసీ సుదర్శనరావు నుంచి కరెస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి అందుకున్నారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, అకాడమి ప్రెసిడెంట్ నాదెళ్ళ ద్వారకనాథ్, ప్రిన్సిపాల్ సి.యువరాజ్, ప్రతాప్‌సింహా కాకాసాహెబ్, రంగ జనార్థన, రవీంద్రబాబు, టీఎస్ఎస్ బాలాజీ, శివప్రసాద్‌రెడ్డి, తదితరులు అభినందించారు.

## పాడిరైతులకు అందుబాటులో ఉండండి

గుర్రంకొండ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పశువైద్య సిబ్బంది పాడిరైతులకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని పశుసంవర్థకశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులనాయుడు అన్నారు. గుర్రంకొండ పశువైద్య కేంద్రాన్ని గురువారం తనిఖీ ఆయన మాట్లాడుతూ పాడిరైతులకు అవసరమైన మందులు, పౌష్టికాహారం పదార్థాలను అందుబాటులో ఉంచాలన్నారు. లంపీస్కిన్ వ్యాధి పశువులకు సోకకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయాలన్నారు.

## మాజీ ఎంపీపీ రామకృష్ణ మరణం తీరనిలోటు

నిమ్మనపల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): టీడీపీ మాజీ ఎంపీపీ, టీడీపీ సీనియర్ నేత మేషా రామకృష్ణ మరణం పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే షాజహాన్‌బాష, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, రాష్ట్ర యువత అధ్యక్షుడు శ్రీరాం చినబాబు పేర్కొన్నారు. గురువారం తవళం గ్రామంలో రామకృష్ణ మృతదేహానికి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కీలకనేతగా వుంటూ ఎంపీపీగా పని చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. నేలమల్లేశ్వసామి దేవాయాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే శోభమ్మ, క్లస్టర్ ఇన్‌చార్జి మునిరత్నం, బాబురెడ్డి, మండల నేతలు చెంగ్రాయుడు, విజయ్, చినబాబు, సుధాకర్‌రావు, మహమ్మద్ రఫి, రామచంద్ర, గంగాధర, శంకర, శ్రీనివాసులు సంతాపం వ్యక్తం చేశారు.

## మాజీ ఎమ్మెల్యే పరామర్శ

పెద్దమండ్యం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన వడ్డిపల్లి సీనియర్ టీడీపీ కార్యకర్త తిమ్మయ్య సమాధి వద్ద తంబళ్ళపల్లి టీడీపీ మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ యాదవ్ నివాళులర్పించారు. తరవాత వడ్డిపల్లిలోని ఆయన కుటుంబ సభ్యులు నాగార్జున, క్రిష్ణమూర్తిని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు జిట్టా వెంకటరమణ, రాష్ట్ర ఎస్టీసెల్ కార్యదర్శి మనోహర్ నాయక్, రాజంపేట పార్లమెంట్ బీసీ,ఎసీ సెల్ అధ్యక్షులు సురేంద్రయాదవ్, నటరాజ్ నాయక్, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## ములకలచెరువులో 'హర్ ఘర్ తిరంగా'

ములకలచెరువు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో గురువారం జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పంచాయతీ అధికారులు హర్ ఘర్ తిరంగ్ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ పతాకాలను చేతబట్టి జూనియర్ కళాశాల నుంచి బస్టాండు సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టి మానవహారంగా నిలబడ్డారు. ప్రిన్సిపాల్ ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ శివరామయ్య, అధ్యాపకులు నోములమ్మ, అమరావతి, రేష్మా, కళావతి, నాగమోహన్, క్రిష్ణప్ప, జయచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామ్లా నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ

మదనపల్లె టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మహిళల మొబైల్ ఫోన్‌లో స్త్రీ శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఉపయోగిస్తే నిరంతర రక్షణ కల్పిస్తామని శక్తి టీమ్ సభ్యులు రంగస్వామి, కుమార్‌నాయక్ పేర్కొన్నారు. బీటీ డిగ్రీ కళాశాలలో శక్తి టీమ్ విద్యార్థులు, మహిళా అధ్యాపకులకు శక్తి యాప్ గురించి వివరించారు. శక్తి టీమ్ సభ్యులు మణికంఠ, శశికళ, వీణకుమారి, బీటీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి పాల్గొన్నారు.

## బ్యాంక్ మేనేజర్‌ను సన్మానించిన రైతులు

గుర్రంకొండ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): తరిగొండ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ షేక్ షావలి సేవలు ఆదర్శనీయమని పలువురు రైతులు అన్నారు. బదిలీపై తిరుపతి బ్రాంచ్‌కు వెళ్లిన మేనేజర్‌ను గురువారం రైతులు సన్మానించారు. రైతులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

రామసముద్రం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మదనపల్లె డీఎస్పీ మహేంద్ర గురువారం రామసముద్రం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. బార్డర్ చెక్‌పోస్టుల్లో తనిఖీ చేపట్టి అక్రమ మద్యం, మాదకద్రవ్యాలను నియంత్రించాలని సీఐ, ఎస్ఐలను ఆదేశించారు. పిల్లలకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని, మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం ఆంజనేయస్వామి కాలనీలో బాలిక ఇంటికి వెళ్లి విచారణ చేపట్టారు.

## వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



పెద్దతిప్పసముద్రం ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): విసనకర్రవాండ్లపల్లెలో దేవకి కుటుంబీకులచే నిర్మించిన అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠ మూడు రోజులుగా వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ అమ్మవార్ల నూతన విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యజమాన శస్త్ర, వస్త్ర సమర్పణ, విశేష ద్రవ్యాహుతి, మహాపూర్ణాహుతి, గోపూజ, మహామంగళారతి, యత్రాధనం పూజలు చేసి మహాకుంభాభిషేకం, వైభవంగా నిర్వహించారు. గురువారం దేవకి కుటుంబీకులచే అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు. గ్రామస్తులు, సమీప గ్రామ ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు.

## నిందితులను శిక్షించాలి

గుర్రంకొండ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మహిళా సమాఖ్య ఏపీఎం రజనీకుమారిపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని సంఘమిత్రాలు నిరసన వ్యక్తం చేశారు. గురువారం అన్ని గ్రామాల సంఘమిత్రాలు స్థానిక కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సంఘమిత్రలు ప్రమీల, అనిత, లలిత, శారద, రోజా, సరస్వతి, లక్ష్మీదేవి, నందినీ, శిరీషా, పుష్ప, ఉష రాణి, భాస్కర్, శ్రీరాముల రెడ్డి, రెడ్డెమ్మ, షమి మునీషా, పావని, రామాంజులమ్మ, కళ్యాణి పాల్గొన్నారు.

## స్కాలర్‌షిప్‌లు పంపిణీ

పీలేరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కెనరా బ్యాంకు అందించే కెనరా విద్యాజ్యోతి స్కాలర్‌షిప్‌లను గురువారం బ్యాంకు సిబ్బంది పంపిణీ చేశారు. స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు డి.హేమలత, బి.వర్షిత, డి.అనూష ఒక్కొక్కరికి రూ.5 వేలు, బి.లక్ష్మీప్రియ, జె.అనిత ఒక్కొక్కరికి రూ.3 వేలు చొప్పున స్కాలర్‌షిప్‌లు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ దేవరింటి లోకేశ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.